

ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో వైసీపీ జడ్పీటీసీ సభ్యుల వాగ్వాదం

జడ్పీలో ఉద్రిక్తత

సర్వ సభ్య సమావేశంలో ముఖ్యమంత్రిని ఉద్దేశించి పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు అనుచిత వ్యాఖ్యలు

అభ్యంతరం వ్యక్తం చేసిన ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు

- 'భూముల ఆక్రమణలకు సంబంధించి పత్రికల్లో వచ్చిన కథనాలపై మాట్లాడదామా...'అంటూ సవాల్
- శాసనసభ్యుని వైపు దూసుకువచ్చిన వైసీపీ సభ్యులు
- కొద్దిసేపు వాగ్వాదం
- సర్దిచెప్పిన బండారు, ఇతర సభ్యులు



వైసీపీ జడ్పీటీసీ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బండారు, కేఎస్ఎన్ఎస్ రాజు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో శనివారం కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎన్నికల సమయంలో ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, వాటి అమలుకు భయపడుతున్నారని వైసీపీకి చెందిన పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు సుంకరి గిరిబాబు చేసిన వ్యాఖ్యలపై ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సుందరపు విజయకుమార్‌తో వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు వాగ్వాదానికి దిగడంతో ఒక్కసారిగా సభలో గందరగోళం ఏర్పడింది.

చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశం శనివారం ఉదయం పది గంటలకు ప్రారంభమైంది. వ్యవసాయ శాఖపై చర్చలో జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు వీరవెంకట సత్య నారాయణకుమార్ లేచి అచ్యుతాపురం మండలం దోసూరు జడ్పీ ఉన్నత పాఠశాల స్థలం ఆక్రమణకు గురవుతుందని, కబ్జాదారులు ఎమ్మెల్యే పేరు చెబుతున్నారని అనడంతో చర్చ పక్కదారి పట్టిస్తున్నారంటూ జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ దశలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జోక్యం చేసుకుని పాఠశాల భూమిని గత ... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్ ప్రక్షాళనకు డిమాండ్

- వైద్య సేవలు మెరుగుపరచాలని కోరిన సభ్యులు
- తుంగ్లాం ప్రాథమిక పాఠశాల కబ్జాపై నిలదీసిన ఎమ్మెల్యే పల్లా

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో వైద్య సేవలు మెరుగుపరచాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కోరగా అన్ని పార్టీల సభ్యులు ఆయనకు మద్దతు పలికారు. రోగుల కోసం వాకబు చేయడానికి యత్నిస్తే సూపరింటెండెంట్ కనీసం స్పందించడం లేదని పలువురు ఆరోపించారు. ఇటువంటి సమస్యకు తెర పడాలంటే కేజీహెచ్‌లో సూపరింటెండెంట్‌కు సాయంగా ఒక పీఆర్వోను నియమించాలని కోరగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సానుకూలంగా స్పందించారు. మరికొందరు సభ్యులు లేచి కేజీహెచ్ మార్చురీ వద్ద సొమ్ములు అడుగుతున్నారని, చివరకు సర్టిఫికెట్ల జారీకి పైసలు ఇవ్వాల్సి వస్తోందని ధ్వజమెత్తడంతో పాటు కేజీహెచ్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. సభ్యుల ఆందోళనపై కలెక్టర్ స్పందిస్తూ సేవలు మెరుగుపరచడంతో పాటు అవినీతిని అరికడతామని హామీ ... మిగతా 6వ పేజీలో



పట్టాలు తప్పిన కోచ్‌లు

పట్టాలు తప్పిన రైలు

- ఖాళీ కోచ్‌లతో యార్డు నుంచి ప్లాట్‌ఫారంపైకి వస్తుండగా ప్రమాదం
- రాకపోకలకు అంతరాయం
- ఆలస్యంగా బయలుదేరిన విశాఖ ఒరిజినేటింగ్ రైళ్లు

విశాఖపట్నం, జూలై 27: విశాఖ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు (12861) శనివారం కోచింగ్ యార్డులో పట్టాలు తప్పింది. ఖాళీ కోచ్‌లతో యార్డు నుంచి ప్లాట్‌ఫారం మీదకు వస్తుండగా స్టేషన్ సమీపంలో చివరి రెండు బోగీలు (జనరల్ కోచ్, ట్రైన్ మేనేజర్ (గార్డు) కోచ్‌లు) పట్టాలు తప్పాయి. సమాచారం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. దెబ్బతిన్న రెండు కోచ్‌లను రేక్ నుంచి పక్కకు తప్పించి వాటి స్థానంలో మరో రెండింటిని జత చేసి ప్లాట్‌ఫారం మీదకు తీసుకువచ్చారు. ఈ ఘటనతో యార్డు, స్టేషన్‌కు మధ్య రెండు లైన్లలో గంటల తరబడి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో విశాఖ నుంచి బయలుదేరే పలు ఒరిజినేటింగ్ రైళ్లను యార్డు నుంచి స్టేషన్‌కు చేర్చడంలో ఆలస్యం అయ్యింది. ఈ ప్రభావంతో విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌తో (12861) పాటు, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12837), నాందేడు ఎక్స్‌ప్రెస్ (12861) వంటి పలు రైళ్లు విశాఖ నుంచి గంటల తరబడి ఆలస్యంగా బయలుదేరాయి. ట్రాక్ పాయింట్ ఫెయిల్ అవ్వడంతో రైలు పట్టాలు తప్పినట్టు తెలిసింది. కాగా ఈ ఘటనకు సంబంధించి అధికారులు విచారణ చేపట్టినట్టు సమాచారం.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

గత ప్రభుత్వ హయాంలో ఆరోపణలు ఎదుర్కొన్నవారికి ప్రధాన మండలాల్లో అవకాశం

- ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా పైరవీలు
- విస్మయం కలిగిస్తున్న కూటమి నేతల మౌనం

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

ప్రభుత్వం మండల తహసీల్దార్లకు పోస్టింగులు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో ఎవరైతే చక్రం తిప్పారో, ఆ పార్టీ నేతలకు అనుకూలంగా పనిచేశారో వారికే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోను ప్రాధాన్యం లభించింది. జిల్లాలో ప్రధాన మండలాలకు వారినే తహసీల్దార్లుగా నియమించారు. కూటమి ఎమ్మెల్యేలూ వారినే కోరుకోవడమేమిటో అర్థం కావడం లేదు. గతంలో భూ అక్రమాలకు సహకరించిన వారిని ఏరికోరి తెచ్చుకోవడం విస్మయపరుస్తోంది.

సాధారణ ఎన్నికల ముందు తహసీల్దార్లను పక్క జిల్లాల్లో విధులకు పంపించారు. ఆ ప్రక్రియ అంతా పూర్తి కావడంతో సొంత జిల్లాలకు వారిని వెనక్కి పంపించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే గతంలో ఎక్కడ పనిచేసిన వారికి అక్కడ కాకుండా వేరేచోట నియమించాలని సీసీఎల్‌ఏ ఆదేశించింది. పోస్టింగ్‌లు ఇచ్చే బాధ్యత జిల్లా కలెక్టర్‌కు ఇచ్చినా..అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు చెప్పినట్టుగా చేయాలని పైనుంచి ఆదేశాలు వచ్చాయి. చాలామంది ఎమ్మెల్యేలు తమకు ఎవరు కావాలో కోరుకున్నారు. అయితే వారిని కూటమి ఎమ్మెల్యేలు నిజంగా కోరుకున్నారా?...లేదంటే ఆ తహసీల్దార్లే కీలక మండలాలు ఎంచుకొని ఆ ఎమ్మెల్యేలను సంతృప్తి పరిచి వచ్చారా?... అనేది తెలియడం లేదు. జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు తహసీల్దార్ల పోస్టింగ్‌ల విషయంలో ఎటువంటి సిఫారసులు చేయలేదు. అటువంటిచోట పైరవీలు చేసి కొందరు ఆర్డర్లు తెచ్చుకున్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల విషయంలో ఆ పార్టీ పెద్దలు చెప్పినట్టు చేసి, వారితో పాటు తహసీల్దార్లు కూడా ఆర్థికంగా బలపడ్డారు. ఆ దాహం తీరక మళ్లీ కీలక మండలాల్లోకి రావడంతో భూములకు మూడినట్టేనని ప్రచారం జరుగుతోంది.

21 మందికి పోస్టింగ్‌లు

విశాఖ జిల్లాలో 21 మంది తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆరోగ్య శాఖలో పనిచేస్తూ పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న ఎం.రమేశ్‌ను సీతమ్మధార తహసీల్దార్‌గా వేశారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ఎం.పాల్‌కిరణ్‌ను విశాఖపట్నం రూరల్ తహసీల్దార్‌గా, కేవీ ఈశ్వరరావును కూడా కలెక్టరేట్ సూపరింటెండెంట్ (పరిపాలన)గా, పి.రామారావును భీమిలి తహసీల్దార్‌గా, ఎల్.రామారావును పెదగంట్యాడకు, కె.వేణుగోపాల్‌ను పెందుర్తి తహసీల్దార్‌గా నియమించారు. పార్వతీపురంలో ఉన్న కె.ఆనందరావును వీఎంఆర్‌డీఏ భూసేకరణ విభాగంలో స్పెషల్ తహసీల్దార్‌గా, ... మిగతా 6వ పేజీలో

దసపల్లా భూములపై దృష్టి పెట్టేనా??

- రికార్డుల్లో పేర్లు చేర్చేందుకు విశ్వ ప్రయత్నాలు
- మరోవైపు వాటర్ ట్యాంకులు మార్చాలని జీవీఎంసీకి 'ఎష్యూర్ కంపెనీ' దరఖాస్తు
- 100 అడుగుల రహదారి నిర్మాణానికి
- వైసీపీ ప్రభుత్వ హయాంలో యత్నం



భూముల్లో రాణీ సాహెబా వారసులు పెట్టిన బోర్డులు

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

దసపల్లా భూముల వ్యవహారంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారిస్తుందా?, లేదా?...అనే విషయం నగరంలో చర్చనీయాంశంగా మారింది. దశాబ్దాల పాటు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆ భూములను సాయిరెడ్డి అండ్ కో కోర్టు ఉత్తర్వులు చూపించి వైసీపీ ప్రభుత్వ హయాంలో హస్తగతం చేసుకున్న సంగతి తెలిసిందే. దసపల్లా భూములను కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేసిన నగర ప్రముఖులతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ ('ఎష్యూర్ ఎస్టేట్ డెవలపర్స్ ఎల్ఎల్‌పీ' పేరుతో) చేసుకొని, సాయిరెడ్డి బృందం చేజిక్కించుకుంది. వారి పేర్లను జీవీఎంసీలో ఉన్న టౌన్ సర్వే రికార్డుల్లో ఇన్ కార్పొరేట్ (హక్కుదారులుగా చేర్చేందుకు) చేసేందుకు కూడా అప్పట్లో ప్రయత్నాలు జరిగాయి. మొన్నటివరకు కమిషనర్‌గా పనిచేసిన సాయికాంత్ వర్మ ఆయా హక్కుదారుల పేర్లను రికార్డుల్లో చేర్చాలని టౌన్ ప్లానింగ్ విభాగానికి ఆదేశాలు జారీచేశారు. అయితే అప్పటికే రికార్డుల్లో ఆ భూములకు హక్కుదారులుగా రాణి సాహెబా వాద్వాన్ పేరు నమోదైంది. అంతేకాకుండా వారి వారసులు దసపల్లా భూముల్లో అవి తమ భూములని, కోర్టులో కేసులు వేశామని, ఎవరూ ప్రవేశించడానికి వీల్లేదంటూ బోర్డులు పెట్టారు. తమకు హక్కుగా సక్రమించిందని చెప్పేందుకు ఆ భూముల కొనుగోలుదారుల వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడం, లింక్ డాక్యుమెంట్లు సమర్పించకపోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు ఆయా పేర్లను ఇన్‌కార్పొరేట్ చేయడానికి నిరాకరించారు. ఒకవేళ అలా కాదని ముందుకు వెళ్లదలుచుకుంటే పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని, అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉంటుందని కమిషనర్‌కు అధికారులు సూచించారు. అదే జరిగితే...అనేక అభ్యంతరాలు వస్తాయని, అసలుకే మోసం వస్తుందని భావించి ఇన్‌కార్పొరేట్ చేయకుండా పక్కన పెట్టారు.

వాటర్ ట్యాంకులు మార్చాలని లేఖ

ప్రభుత్వ ఆదేశం మేరకు కలెక్టర్ ఆయా భూములను 22-ఏ నుంచి తప్పించగా వాటిలో ... మిగతా 6వ పేజీలో

బాబోయ్ బంగాళాదుంప!!


- బయట మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.70
- రైతుబజార్లలో సరకు నిల్



విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బంగాళా దుంపల ధరలు వింటే...'అయ్య బాబోయ్ అంత రేటా?' అనాల్సి వస్తోంది. గత వారం రోజులుగా నగరంలో బంగాళా దుంపలు కనిపించడం లేదు. రైతుబజార్ల సంగతి చెప్పనక్కర్లేదు. సరకు రావడం లేదని అమ్మడం మానేశారు. పశ్చిమ బెంగాల్ నుంచి ఎగుమతులు ఆగిపోవడం వల్లే సరకు రావడం లేదని టోకు వర్తకులు చెబుతున్నారు. దిగుమతులకు లోటు లేనంత కాలం (వారం క్రితం వరకు) రైతుబజార్లలో కిలో రూ.34 నుంచి రూ.38 వరకు లభించేవి. బయట కూడా కిలో రూ.40కి ఇచ్చేవారు. ఇప్పుడు బయట వర్తకులు ఎక్కడెక్కడి నుంచో దుంపలు తెప్పించుకొని కిలో రూ.50 నుంచి రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రతి ఇంట్లో ఉల్లి, టమాటా ఎంత అవసరమో బంగాళా దుంప కూడా అంతే అవసరం. ప్రస్తుతం రైతుబజార్లలో ఇవి లభించకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. టమాటా ధర పెరిగిందని, వాటిని చిత్తూరు నుంచి తెప్పించి తక్కువ ధరకు ఇస్తున్నట్టే, బంగాళాదుంపలను కూడా రప్పించి సరసమైన ధరకు అమ్మించాలని వినియోగదారులు కోరుతున్నారు. టమాటాను కిలో రూ.30 చొప్పున శనివారం విక్రయించగా, ఆదివారం ధర రూ.32గా నిర్ణయించినట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

బదిలీ రద్దాయె, సొమ్ములు పోయె!

వైసీపీ హయాంలో అడ్డగోలు బదిలీల కోసం డబ్బులు వసూలు చేసిన పెద్దలు



- రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ కలెక్షన్ ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి రూ.2 కోట్లు వరకూ వసూళ్లు
- ఎన్నికల ముందు హడావిడిగా ఉత్తర్వులు
- ఇప్పుడు వాటిని రద్దు చేయడంతో టీచర్ల గగ్గోలు
- అజ్ఞాతంలోకి 'మధ్యవర్తి'
- సొమ్ములు తిరిగి ఇవ్వాలంటూ టీచర్లు పట్టు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పాఠశాల విద్యా శాఖ అడ్డగోలుగా చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలను కొత్త ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో బదిలీల కోసం ఉపాధ్యాయుల నుంచి డబ్బులు తీసుకున్న వ్యక్తులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సెల్‌ఫోన్‌లు కూడా స్విచ్ ఆఫ్ చేసేయడంతో టీచర్లు లబోదిబోమంటున్నారు.

ఎన్నికలకు ఆరు నెలల ముందు మైదాన, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో పోస్టింగ్ కోసం ఓ మంత్రిని సంప్రతించారు. ఈ వ్యవహారంలో సదరు మంత్రి వద్ద పీఏగా పనిచేస్తున్న వ్యక్తి మధ్యవర్తిగా ఉండి కథ నడిపారు. ఒక్కొక్కరి వద్ద రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకూ వసూలు చేశారు. అలా డబ్బులు ఇచ్చిన వారికి పోస్టింగ్ ఇవ్వాలని కోరుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు కొద్దిరోజుల ముందు జిల్లా విద్యాశాఖాధికారిణికి విద్యా శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఫిబ్రవరి, మార్చి తొలి వారంలో బదిలీ అయిన టీచర్లు జూన్ 12వ తేదీ తరువాత విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈలోగా నోటిఫికేషన్ విడుదల కావడం, ప్రభుత్వం మారిపోవడంతో ఆ ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు.

ఇదిలావుండగా గత ఏడాది నుంచి ఈ ఏడాది మార్చి తొలి వారం వరకు మూడు రకాలుగా బదిలీలు చేపట్టారు. మొదటిది...ముఖ్యమంత్రి కార్యాలయం సిఫారసు మేరకు జరిగిన బదిలీలకు ఆర్థికశాఖ అనుమతి ఇచ్చింది. రెండోది ముఖ్యమంత్రి కార్యాలయం ... మిగతా 6వ పేజీలో

1,2 తేదీల్లో ఇంటి వద్దే పింఛన్లు

- నూరుశాతం ఒకటో తేదీనే...

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే నెల ఒకటి, రెండు తేదీల్లో ఇళ్ల వద్దే ఎన్టీఆర్ సామాజిక పింఛన్‌ల పంపిణీకి ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు నెలకు సంబంధించి 1,63,210 మంది పింఛన్‌దారులకు రూ.70,05,23,500 పంపిణీ చేస్తామన్నారు. నాలుగు గ్రామీణ మండలాల్లో 27,114 మంది పింఛన్‌దారులకు రూ.11,26,21,000, జీవీఎంసీ పరిధిలో 1,36,096 మంది పింఛన్‌దారులకు రూ.58,78,62,500 పంపిణీకి ఏర్పాట్లుచేశామన్నారు. ఒకటో తేదీనే 100 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఒకటో తేదీన సాంకేతిక సమస్యలు తలెత్తిన వారికి రెండో తేదీన పంపిణీ చేయాలన్నారు. పింఛన్‌దారులంతా ఒకటో తేదీన ఇళ్ల వద్దే అందుబాటులో ఉండాలని కోరారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న పింఛన్‌దారులు ఒకటో తేదీనాటికి సొంత ఇళ్లకు చేరుకోవాలని కలెక్టర్ కోరారు.

స్టాండింగ్ కమిటీలో పది స్థానాలూ కైవసం చేసుకోవాలి

- కూటమి కార్పొరేటర్ల సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యేలు
- నామినేషన్ల దాఖలు రేపు



సమావేశంలో మాట్లాడుతున్న గంటా. చిత్రంలో వెలగపూడి, గణబాబు, పంచకర్ల, గండి బాబ్జీ, పీలా గోవింద, శ్రీనివాస్ ఉన్నారు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఏడున జరిగే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పది స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా జీవీఎంసీలో కూటమి జెండా ఎగురవేయాలని ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్లతో సమన్వయ సమావేశం శనివారం దసపల్లా హోటల్‌లో జరిగింది. ఇటీవల టీడీపీ, జనసేనలో చేరిన కార్పొరేటర్లు సైతం ఈ సమావేశానికి హాజరయ్యారు. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలు ఉన్నందున ఏ పార్టీకి ఎన్ని స్థానాలు ఇవ్వాలి, వారిని ఎవరు ఎంపిక చేయాలనేదానిపై నేతలు, కార్పొరేటర్ల మధ్య చర్చ జరిగింది. స్టాండింగ్ కమిటీకి పోటీ చేసే సభ్యులను ఎంపిక చేసే బాధ్యతను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు అప్పగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం కూటమికి 47 మంది సభ్యులు మద్దతు ఉన్నందున మరో ఐదుగురిని పార్టీలో చేర్చుకుంటే మంచిదని టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. కూటమి నుంచి పోటీ చేసేవారంతా సోమవారం నామినేషన్లు దాఖలు చేయాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారానికి చొరవపై అభినందన


ఎమ్మెల్యే వంశీకృష్ణను అభినందిస్తున్న గౌరీ సేవాసంఘం సభ్యులు

అల్లిపురం, జూలై 27: శాసనసభలో వెంకటేశ్వరమెట్ట భూ సమస్యను లేవనెత్తిన దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌కు అల్లిపురం వెంకటేశ్వరమెట్ట గౌరీ సేవా సంఘం కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న దేవదాయశాఖకు సంబంధించిన ఈ భూ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేసిన సందర్భంగా శనివారం ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభులు పొలమరశెట్టి శ్రీను, సూరిశెట్టి వేలు, బుద్దా గోపి, సూరిశెట్టి శంకర్, బుద్ద సన్యాసిరావు,దొడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఆ వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకోవద్దు'

కంచరపాలెం, జూలై 27: గత వైసీపీ ప్రభుత్వ రాక్షసపాలనలో భాగస్వాములైన ఎవరినీ టీడీపీలో చేర్చుకోవద్దని టీడీపీ జీవీఎంసీ 54వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్ కోరారు. ఈ మేరకు జిల్లా పార్లమెంటరీ స్థాయి నేత గండిబాబ్జీకి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ స్థితిలో వైసీపీ నుంచి కొంతమందిని టీడీపీలోకి చేర్చకోవడం వల్ల ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. తమ వార్డు నుంచి ప్రస్తుత కార్పొరేటర్ టీడీపీలోకి చేరడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

మొక్కలే మానవాళి మనుగడకు ఆధారం


కేంద్రీయ విద్యాలయంలో మొక్కలునాటుతున్న ప్రిన్సిపాల్

కంచరపాలెం, జూలై 27: మొక్కలు పెంపకంతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉంటుందని 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం- 2 ప్రిన్సిపాల్ జి. కిశోర్ పేర్కొన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్కూల్ న్యూట్రిషియన్ డే ను కేవీలో ఘనంగా నిర్వహించారు. అలాగే, వివిధ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మదీనా మాలిక్, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 42వ వార్డు జగన్నాథపురంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని శనివా రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ఎం. ఆశాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలోఉపాధ్యాయులు ఎన్.వరలక్ష్మి, మాధురి, షేక్ గౌసియా బేగం, అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మి పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ యోజన కరపత్రాలు ఆవిష్కరణ



కరప త్రాలు ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, ఎమ్మెల్యేలు

డాబాగార్డెన్స్, జూలై 27: పీఎం సూర్యఘర్ యోజన పథకం కరపత్రాలను శనివారం జడ్పీ హాల్ విడుదల చేశారు. కలెక్టర్ ఎం.ఎం.హరేంధిరప్రసాద్, ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, జెడ్పీ చైర్‌పర్సన్ జి.సుభద్ర, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జెడ్పీ పోలినాయుడు, మునగపాక, అరకు, అనంతగిరి జెట్పీటీసీలతో ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్, జోన్ 3, అనకాపల్లి, నర్సీపట్నం, కశింకోట, పాడేరు అధికారులున్నారు. గృహ విద్యుత్ వినియోగదారులకు రాయితీపై ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.









బీఎస్ఎన్ఎల్‌తో బీవీసీ గ్రూపు ఎంఓయూ


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జూలై 27: టెలికాం, ఎడ్యుకేషనల్ రంగాల్లోని మారుతున్న స్థితిగతులను అవగాహన చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ పీజీఎంటీడీ పాల్ విలియమ్స్ విద్యార్థులకు సూచించారు. డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం బీఎస్ఎన్ఎల్, బీవీసీ గ్రూప్ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఎంఓయూతో మారుతున్న టెక్నాలజీని టెలికాం సెక్టార్‌ను విద్యార్థులు అందిపుచ్చుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. బీఎస్ఎన్ఎల్ పీజీఎం జి.ఆడమ్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పనలో ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏ విధంగా ఉన్నాయో వివరించారు. మరో సెక్షన్ పీజీఎం ఎం. సత్యప్రసాద్ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ నిర్వహిస్తున్నట్లు ట్రైనింగ్, రీసెర్చ్, ఎమర్జింగ్ 4జీ, 5జీ, 6జీ ఐఓటీ , ఎం.ఎల్ అండ్ ఏఆర్అండ్‌వీఆర్ ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీవీపీ గ్రూప్ ప్రిన్సిపాల్ టి.వి. జనార్ధన్‌రావు, బీఎస్ఎన్ఎల్ అధికారులు కె. జగదీశ్వరరావు, బి. శ్రీనివాసరావు, ఆర్. శ్రీకాంత్, ఎన్‌వీబీ శ్రీదేవి పాల్గొన్నారు.

ఐటీఐ కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపు

కంచరపాలెం, జూలై 27 : కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో శనివారం నిర్వహించిన ఐటీఐ కౌన్సెలింగ్‌లో ఎలక్ట్రికల్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, వెల్డర్ తదితర ట్రేడుల్లో ఉన్న 132 సీట్లను అభ్యర్థులకు మెరిట్ ప్రకాకం కేటాయించినట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. తొలిరోజే అధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరుకావడంతో మొదటి విడతలో మిగిలిన సీట్లు అన్నీ భర్తీ చేసినట్టు తెలిపారు. ఆదివారం కౌన్సెలింగ్ లేదని, అభ్యర్థులు గమనించి హాజరు కావద్దని కోరారు.

హౌరా-యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

విశాఖపట్నం, జూలై 27: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హౌరా, యశ్వంత్‌పూర్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల సర్వీసులను కొనసాగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఆగస్టు 15వ తేదీ వరకు హౌరా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (02863), ఆగస్టు 17వ తేదీ వరకు యశ్వంత్‌పూర్ - హౌరా (02864) ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కాగా, గుంటూరు డివిజన్‌లో ట్రాఫిక్ బ్లాక్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సంత్రాగచ్చి-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(07222)ఆగస్టు 11నవయా విజయవాడ, వరంగల్, కాజీపేట మీదుగా, తిరిగి సికింద్రాబాద్-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (07221) ఆగస్టు 13న వయా కాజీపేట, వరంగల్, విజయవాడ మీదుగా నడుస్తాయని తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

మహారాణిపేట, జూలై 27: బంగారం, వెండి వస్తువులు దొంగలించిన నిందితుడిని అరెస్టు చేసినట్టు డీసీపీ (క్రైమ్) వెంకట రత్నం తెలిపారు. శనివారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. ఈనెల 22 వ తేదీన విశాఖ లోని పెదజాలారిపేట గాంధీ సెంటర్‌లో ఓ ఇంట్లో అర్ధరాత్రి దొంగతనం జరిగింది. దాదాపు 2.71 లక్షల రూ పాయలు 6 తులాల బంగారు వస్తువులు 3 కేజీ ల వెండి వస్తువులు అపహరించారు. దీనితో బాధి తులు ఎంవీపీ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు న మోదు చేసిన పోలీసులు అనుమా ని తునిగా పెద జాలారిపేటకే చెందిన గుర్రపు శివ (24) అనే పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకుని విచా రించారు. నేరం అంగీకరించటంతో అతని వద్ద నుంచి 36.76 గ్రా ముల బంగారం, 2604.87 గ్రాముల వెండి వస్తు వు లను రికవరీ చేశారు. అరెస్టు చేసి రి మాండ్‌కు తరలించినట్టు ఏసీపీ తెలిపారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

కంచరపాలెం, జూలై 27 : స్థానిక కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు బ్రాంచీల్లో చదువుతున్న టాపర్స్‌కు పూర్వవిద్యార్థులు (1971-1975) బ్యాచ్ ప్రామాణిక పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ మేరకు శనివారం వీటిని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి. రమణ చేతుల మీదుగా అందజేశారు.పూర్వవిద్యార్థులు వి.రామచంద్రరావు, వి. నాగభూషణం, కనకసాయి, జె. శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మురళీనగర్ ;మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పల్లా. చంద్రమౌళి తెలిపారు.ఉదయం 6నుంచి మధ్యాహ్నం వరకు సేవలందిస్తారు.

బదిలీ రద్దాయె, సొమ్ములు పోయె!

... 5వ పేజీ తరువాయి

అనుమతి మేరకు జరిగిన బదిలీలకు ఆర్థిక శాఖ అనుమతి లేకపోవడం. మూడోది..సీఎం కార్యాలయం, ఆర్థిక శాఖ నుంచి అనుమతి లేకుండా చేసిన బదిలీలు. ఈ మూడింటిలో తొలి రెండు రకాల బదిలీల జోలికి ప్రస్తుత ప్రభుత్వం వెళ్లకుండా సీఎం పేషీ, ఆర్థిక శాఖ అనుమతి లేకుండా జరిగిన బదిలీలను మాత్రం రద్దు చేసింది. ఈ బదిలీల్లో విజయనగరానికి చెందిన వ్యక్తే కీలక పాత్ర పోషించారు. మంత్రి వద్దకు వెళ్లిన టీచర్లతో సదరు పీఏ మాట్లాడి డబ్బులు వసూలు చేసేవారు. నెల్లిమర్ల మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల టీచరు ఒకరు బ్రోకరుగా ఉన్నారు. కొందరు మంత్రి పీఏకు, మరికొందరు టీచరుకు సొమ్ములు ఇచినట్టు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. విశాఖ జిల్లా నుంచి సుమారు రెండు కోట్ల రూపాయల వరకు వసూలు చేశారని అంటున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి తరువాత చేసిన బదిలీలను ప్రభుత్వం రద్దు చేయడంలో సొమ్ములు ఇచ్చిన టీచర్లంతా సదరు పీఏను కలిసేందుకు విజయనగరం వెళ్లగా...అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లి వాకబు చేస్తే క్యాంపు వెళ్లారని చెబుతున్నారు. ఎప్పుడు వస్తారని అడిగితే సమయం పడుతుందని తప్పించుకుంటున్నారని పలువురు వాపోయారు. చివరకు ఫోన్ కట్టేయడంతో లబోదిబోమంటున్నారు. మరికొందరు నెల్లిమర్ల మండలంలో ప్రభుత్వ టీచరును కలిసి తాము ఇచ్చిన సొమ్ములు సంగతి ఏమిటని ప్రశ్నిస్తే తనకు సంబంధం లేదని చెబుతున్నారు. వారం నుంచి ఆయన కూడా సెల్‌ఫోన్ ఆపేసి స్కూలుకు రాకుండా తప్పించుకుంటున్నారని సొమ్ములు ఇచ్చిన టీచర్లు వాపోతున్నారు. ఇటువంటి వ్యవహారాల్లో పని జరిగితే అదృష్టమే తప్ప ఇచ్చిన సొమ్ములకు గ్యారంటీ ఉండదని ఉపాధ్యాయ సంఘాల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

పొదుపు సంఘాల మహిళలకు చేయూత


సమావేశంలో డ్వాక్రా మహిళలతో బీజేపీ నేత శ్యామల దీపిక, ఏపీడీ పద్మావతి

మురళీనగర్, జూలై 27 ; పొదుపు సంఘాల ద్వారా మహిళల స్వయం స్వావలంబనకు మరింతగా ప్రభుత్వం చేయూత నిస్తుందని జోన్-5 యూసీడీ విభాగం ఏపీడీ పద్మావతి అన్నారు. శనివారం మాధవధార గాంధీనగర్‌లో జరిగిన టౌన్ లెవెల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్) సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రుణ మంజూరు, తిరిగి చెల్లింపుల ద్వారా సక్రమంగా చేపట్టాలని సూచించారు. గతంలో డ్వాక్రా సంఘాలకు రూ.7 లక్షల వరకే రుణ పరిమితి ఉంటే, ప్రస్తుతం దానిని గరిష్టంగా రూ. 20 లక్షల వరకు మంజూరు చేస్తున్నామని ఏపీడీ పేర్కొన్నారు. ఎస్ఎల్ఎఫ్ గ్రూప్ మహిళా సభ్యులు, ఆర్పీలు పాల్గొన్న ఈ మీటింగ్‌లో నార్త్ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామల దీపిక హాజరయ్యారు. జోన్-5 పరిధిలోని 47 నుంచి 54 వరకు ఉన్న ఎనిమిది వార్డుల డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

1 నుంచి దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్ జాన్ ప్రకాష్, తదితరులు

జ్ఞానాపురం, జూలై 27: స్థానిక పునీతుపేతు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో దేవమాత మోక్షరోపణ మహోత్సవాలు ఆగస్టు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు దేవాలయం విచారణ కర్తలు ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. జ్ఞానాపురం చర్చి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టరు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆగస్టు 1వ తేదీ గురువారంపూజ అనంతరం సిలువగుర్తు మండపంలో పీపీసీ అధ్యక్షులు రాజేష్‌తో మహోత్సవ పతాక ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం 14 వరకు ప్రతిరోజూ జపమాల, దివ్యపూజ, పుర వీధుల్లో ఉరేగింపు నిర్వహించనున్నట్టు వివరించారు. 15 వతేదీన ప్రధాన ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఫాదర్లు పి.వినయ్ కుమార్, పి. అంథోని, పీపీసీ అధ్యక్షుడు మునురు రాజేష్,కార్యదర్శి ప్రాన్సిస్, జాయింట్ సెక్రటరీ గేదల ఆనంద్, కుమెలి నిర్మల రాజు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపితే రివార్డు... తప్పుచేస్తే శిక్ష: సీపీ


ప్రశంసా ప్రతం అందిస్తున్న సీపీ శంఖ బ్రతబాగ్చీ

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో పనిచేసే పోలీసు సిబ్బందికి రివార్డులు ఇస్తామని, తప్పుచేసిన వారికి మాత్రం శిక్ష తప్పదని సీపీ శంఖబ్రతబాగ్చి అ న్నారు. కమిషనరేట్‌లో శనివారం రివార్డు మేళా ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వివిధ కేసుల్లో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ నుంచి సీఐ స్థాయి వరకూ 81 మందికి ఆయన రివార్డులు అందజేశారు.ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీలు అజితావేజెండ్ల, తుహీన్‌సిన్హా తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ప్రక్షాళనకు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్మాణాలకు ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. గాజువాక పరిధి తుంగ్లాం ప్రాథమిక పాఠశాల కబ్జాకు గురైందని, దీనిపై ఎందుకు ఫిర్యాదు చేయలేదని అధికారులను నిలదీశారు. దీనిపై చైర్‌పర్సన్ సుభద్ర బదులిస్తూ తక్షణమే తుంగ్లాంలో ఆక్రమణలు తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈలోగా జడ్పీ సీఈవో పోలినాయుడు మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపునకు న్యాయపరంగా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

వేర్వేరుగా సమావేశాలు నిర్వహించండి

జడ్పీ సమావేశంలో పూర్తిస్థాయిలో అజెండా చర్చకు రావడం లేదని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. కేవలం మూడు, నాలుగు అంశాలు మాత్రమే చర్చకు వస్తున్నాయని పేర్కొంటూ మొత్తం అంశాలపై చర్చించాలంటే అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఒక సమావేశం, అనకాపల్లి, విశాఖ జిల్లాల పరిధిలో సభ్యులకు ఒక సమావేశం ఏర్పాటుచేయాలని సూచించగా, సీఈవో పోలినాయుడు వివరణ ఇస్తూ సమావేశాలు వేర్వేరుగా నిర్వహణకు కోరం సమస్య తలెత్తుతుందని పేర్కొంటూ, దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశానికి తొలిసారిగా వచ్చిన ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు, విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, సుందరపు విజయకుమార్‌లను సత్కరించారు.

దసపల్లా భూములపై దృష్టి పెట్టేనా??

... 5వ పేజీ తరువాయి

గతంలో జీవీఎంసీ నిర్మించిన వాటర్ ట్యాంకులు ఉన్నాయి. సుమారుగా 2,200 చ.గ. విస్తీర్ణంలో అవి ఉండడంతో వాటిని అక్కడి నుంచి మార్చాలని ఎష్యూర్ ఎస్టేట్స్ నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికలకు నాలుగు నెలల ముందు జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ రాసింది. సర్వే నంబర్ 1197లో 2,200 గజాల్లో వాటర్ ట్యాంకులు ఉన్నాయని, వాటిని మరో ప్రాంతానికి మార్చాలని, వాటికి అయ్యే వ్యయం తామే భరిస్తామని కోరింది. దీనికి కూడా జీవీఎంసీ అధికారులు లోపాయికారీగా సహకరించారు. మరోవైపు సర్క్యూట్ హౌస్ నుంచి పందిమెట్ట వరకు 30 అడుగుల రహదారి ఉండగా దానిని 100 అడుగులకు విస్తరించడానికి వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేశారు. రహదారి నిర్మాణానికి గత డిసెంబరులో జీవీఎంసీ పత్రిక ప్రకటన కూడా జారీచేసింది. ఎష్యూర్‌కు దఖలు పడిన భూముల్లో కాకుండా ఆ ప్రాంతంలో ఇతరుల భవనాలు దెబ్బతినేలా 100 అడుగుల రహదారి విస్తరణకు నిర్ణయించారు. దీనిపై పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వైసీపీ హయాంలో ఉన్నప్పుడు ట్యాంకులు మార్చడానికి, రహదారి నిర్మాణానికి నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారినందున సమగ్రంగా విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

ఎవరికీ హక్కులు కల్పించడం తగదు

- పీతల మూర్తి యాదవ్, జనసేన కార్పొరేటర్

టౌన్ సర్వే రికార్డుల్లో దసపల్లా భూముల కొనుగోలుదారుల పేర్లు నమోదు చేయడానికి వారి దగ్గర ఎటువంటి పత్రాలు లేనందున అధికారులే తిరస్కరించారని మూర్తి యాదవ్ ఆరోపించారు. పైగా ఆ భూములు తమవని రాణీ సాహెబా వాద్వాన్ వారసులు న్యాయ పోరాటం చేస్తున్నందున వాటిపై ఎవరికీ హక్కులు కల్పించడం తగదని శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం దసపల్లా భూములను తప్పకుండా కాపాడుతుందన్నారు.

కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

- సీపీ హెల్ప్‌లైన్ నంబర్‌కు
- కానిస్టేబుల్ అవినీతికి సంబంధించిన వీడియో?

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న మరో కానిస్టేబుల్‌పై నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి సస్పెన్షన్ వేటు వేశారు. ఫోర్త్‌టౌన్ లా అండ్ ఆర్డర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పి.హరీష్‌కుమార్ అవినీతిపై గుర్తుతెలియని వ్యక్తులు వీడియో తీసి సీపీ హెల్ప్‌లైన్ నంబర్ 7995095799కు వాట్సాప్ చేశారు. సీపీ దీనిని పరిశీలించిన మీదట కానిస్టేబుల్ అవినీతికి పాల్పడినట్టు స్పష్టమైన ఆధారాలు లభ్యం కావడంతో సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఫిర్యాదు చేసినవారి వివరాలు గోప్యంగా ఉంచాల్సి ఉన్నందున కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేయడానికి గల కారణాలను ఇప్పుడే వెల్లడించలేమని సీపీ వివరించారు. కాగా కానిస్టేబుల్ హరీష్‌కుమార్‌పై తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఉన్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్మాణంలో ఇనార్బిట్‌మాల్‌పై నుంచి పడి కొద్దిరోజులు కిందట ఝార్ఖండ్‌కు చెందిన వ్యక్తి మృతిచెందాడు. ఈ వ్యవహారంలో కానిస్టేబుల్ హరీష్‌కుమార్ భారీగా డబ్బులు గుంజినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో స్టేషన్‌లోని ఒక అధికారితోపాటు మరో కానిస్టేబుల్ ప్రోద్బలంతోనే హరీష్‌కుమార్ అలా వ్యవహరించినా, వారు నేరుగా అందులో పాల్గొనకపోవడంతో శిక్ష నుంచి తప్పించుకున్నారని అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు గంజాయి కేసులో వేరే రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ కేసులో నిందితుడు బెయిల్ కోసం ఒక లాయర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని, బెయిల్ పిటిషన్‌తోపాటు ష్యూరిటీ దారులను లాయర్ సిద్ధం చేసిన తర్వాత కానిస్టేబుల్ హరీష్‌కుమార్ జోక్యం చేసుకుని, బెయిల్ పిటిషన్‌ను ఆ లాయర్‌తో కాకుండా తమ స్టేషన్‌లోని కేసులకు సంబంధించిన వ్యవహారాలను చూసే లాయర్‌కు అప్పగించినట్టు మరికొందరు చెబుతున్నారు. ఈ క్రమంలో నిందితుడి వద్ద నుంచి హరీష్‌కుమార్ భారీగా గుంజినట్టు సమాచారం. వీటిల్లోనే ఏదో ఒక వ్యవహారం వీడియో రికార్డింగ్ చేసి సీపీకి పంపి ఉంటారని భావిస్తున్నారు. ఏదిఏమైనా సీపీగా శంఖబ్రతబాగ్చి బాధ్యతలు చేపట్టి నెల రోజులు కాకుండానే ఇద్దరిపై సస్పెన్షన్ వేటు వేయడంతోపాటు మరొకరిని వీఆర్‌కు సరండర్ చేయడంతో పోలీస్ శాఖలోని అవినీతిపరుల్లో గుబులు రేపుతోంది.

జడ్పీలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

పాలకుల నుంచి తమ పార్టీ కార్యకర్తలు ప్రాణాలకు తెగించి పోరాడి కాపాడుకున్నారని, కబ్జాలు ఎవరి హయాంలో ఎక్కువ జరిగాయో అందరికీ తెలుసునని వ్యాఖ్యానించారు. దోసూరు ఒక్కటే కాకుండా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు కాపాడాలని పేర్కొనడంతో బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు స్పందిస్తూ అంశాల వారీగా చర్చించుకోవాలే తప్ప రాజకీయాల ప్రస్తావన వద్దని పేర్కొనడంతో ఆయనకు పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు సుంకరి గిరిబాబు మద్దతు పలుకుతూ అప్రస్తుత విషయాలు ఇక్కడ వద్దన్నారు. దీనికి సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ చర్చ పక్కదారిపడుతున్నా సభకు ఎందుకు నియంత్రించడం లేదంటూ చైర్‌పర్సన్‌ను నిలదీశారు. ఆ తరువాత తిరిగి వ్యవసాయ శాఖపై చర్చ ప్రారంభం కావడంతో పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంతవరకూ రైతులకు రైతుభరోసా సొమ్ము జమ చేయలేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుకు ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భయపడుతున్నారని వ్యాఖ్యానించడంతో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని 9.7 లక్షల కోట్ల అప్పుల్లోకి గత పాలకులు తీసుకువెళ్లారని ఆరోపించారు. ఆర్థికంగా దివాలా తీయించారన్నారు. అందుకు ప్రతిగా గిరిబాబు మరోసారి మాట్లాడేందుకు యత్నించడంతో విజయకుమార్ జోక్యం చేసుకుని సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరి కాదని..'పద్మనాభంలో మీ భూఆక్రమణలపై పత్రికల్లో వచ్చిన కథనాలపై మాట్లాడదామా?' అని ప్రశ్నించారు. దీంతో వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఒక్కసారిగా లేచి విజయకుమార్‌తో వాగ్వాదానికి దిగడంతో సభలో దుమారం రేగి స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ సభ్యులు మూకుమ్మడిగా సుందరపు విజయకుమార్ వైపు రావడంతో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మిగిలిన సభ్యులు ఇరువర్గాలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. గొడవకు దిగిన సభ్యులు బయటకు వెళ్లాలని సుభద్ర హెచ్చరించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు లేచి సభ్యులంతా సంయమనం పాటించాలని కోరడంతో సభలో వివాదం ముగిసింది. తరువాత బండారు మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన సమస్యలపై చర్చించేటప్పుడు ఇతర అంశాల ప్రస్తావన వద్దని సూచించగా, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ సభ్యులంతా సమన్వయంతో మెలిగి సమస్యలపై చర్చించాలని కోరారు.

స్థాయీ సంఘాల సభ్యులుగా ఎంపీలు, ఎమ్మెల్యేలు

శనివారం ఉదయం సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన రావికమతం జడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జడ్పీ స్థాయీ సంఘాల్లో కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలకు స్థానం కల్పించినట్టు జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు ప్రకటించారు. ప్రణాళిక, ఆర్థిక స్థాయీ సంఘం సభ్యులుగా అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం, పాయకరావుపేట, నర్సీపట్నం ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, వంగలపూడి అనిత, చింతకాయల అయ్యన్నపాత్రుడు, గ్రామీణాభివృద్ధి స్థాయీ సంఘ సభ్యుడిగా పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు నియమితులయ్యారు. వ్యవసాయ స్థాయీ సంఘ సభ్యునిగా విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, విద్య వైద్య స్థాయీ కమిటీ సభ్యుడిగా అరకులోయ ఎంపీ తనూజరాణి, స్త్రీ సంక్షేమ, రక్షణ స్థాయీ సంఘ సభ్యుడిగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, వర్క్స్ స్థాయీ సంఘ సభ్యులుగా భీమిలి, పెందుర్తి, అరకులోయ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, రేగం మత్స్యలింగం నియమితులయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు, మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, వరుదు కల్యాణి, జడ్పీటీసీ సభ్యులు, విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయసునీతా కృష్ణన్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

... 5వ పేజీ తరువాయి

అడబాల శ్రీనివాసరావును విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా, వి. సుజాతను కలెక్టరేట్‌లో ల్యాండ్స్ సూపరింటెండెంట్‌గా, ఎం.ఆనంద్‌కుమార్‌ను పద్మనాభం, కె.జయను మహారాణిపేటకు బదిలీ చేశారు. విజయనగరంలోని సీహెచ్‌వీ రమేశ్‌కు గోపాలపట్నం, పి.శ్యామ్‌ప్రసాద్‌ను ఆనందపురం తహసీల్దార్‌గా, కె.రమాదేవిని విశాఖ ఆర్‌డీఓ కార్యాలయంలో డివిజనల్ పరిపాలనా అధికారిగా వేశారు. శ్రీకాకుళం జిల్లాలోని ఎంవ మనోరంజనిని భీమిలి ఆర్‌డీఓ కార్యాలయం ఏఓగా నియమించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి జె.తారకేశ్వరిని ములగాడకు వేశారు. శ్రీకాకుళం జిల్లాలోని బీటీవీ రామారావును విశాఖ రెవెన్యూ డివిజన్‌లో భూసేకరణ విభాగం స్పెషల్ తహసీల్దార్‌గా, ఎంవీకేఎస్ రవిని జీవీఎంసీ ఎస్టేట్ అధికారిగా, వి.శ్యామ్‌కుమార్‌ను కలెక్టరేట్‌లో కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్‌గా వేశారు. గాజువాకలో పనిచేస్తున్న టి.శ్రీవల్లిని అదే స్థానంలో కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. విశాఖలోని భూ సంస్కరణల విభాగంలో పనిచేస్తున్న కె.గణపతిరావును అదే స్థానంలో ఉంచారు.

ఆ ముగ్గురూ....

ఇప్పుడు జరిగిన బదిలీల్లో పి.శ్యామ్‌ప్రసాద్, కె.వేణుగోపాలరావు, ఎం.ఆనంద్‌కుమార్‌లకు కీలక మండలాలు కేటాయించడంపై విమర్శలు వస్తున్నాయి. శ్యామ్‌ప్రసాద్ గతంలో ఆనందపురంలో తహసీల్దార్‌గా పనిచేశారు. అక్కడి నుంచి పెందుర్తి వెళ్లారు. ఎన్నికల ముందు భోగాపురం పంపించారు. ఈయన ఎక్కడ పనిచేసినా వివాదాలు, ఆరోపణలే అధికం. భోగాపురం విమానాశ్రయం సమీపాన ఏపీఐఐసీకి చెందిన 70 ఎకరాల భూమిని వైసీపీ నేతలకు కట్టబెట్టడంలో కీలకపాత్ర పోషించారని ఆరోపణలు వచ్చాయి. పెందుర్తిలో పనిచేసినప్పుడు ప్రభుత్వ భూమిని జిరాయితీగా మార్చి, అందులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ వేసుకోవడానికి సహకరించారనే విమర్శలు ఉన్నాయి. పెందుర్తిలో వైసీపీ ఎమ్మెల్యేకి సహకరించారనే ఆరోపణలు వచ్చాయి. అటువంటి అధికారిని తీసుకువచ్చి ప్రభుత్వ భూములు అధికంగా ఉన్న ఆనందపురం తహసీల్దార్‌గా వేయడం ఆశ్చర్యపరిచింది. ఇక కె.వేణుగోపాలరావు...ఆయన భీమిలి నియోజకవర్గంలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో తహసీల్దారుగా పనిచేశారు. ఇప్పుడు ఆయన్ను పెందుర్తిలో వేశారు. ఎప్పుడూ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనువుగా ఉన్న మండలాల్లోనే ఆయన పోస్టింగ్‌లు వేయించుకోవడం వెనుక ప్రజా ప్రతినిధుల సహకారం ఉందనేది బహిరంగ రహస్యం. ఈయనపైనా అనేక ఆరోపణలు, విమర్శలు ఉన్నాయి. కీలక మండలాల్లో పనిచేసిన అధికారికి నాన్ ఫోకల్‌గా ఏ కలెక్టరేట్‌లోనే వేసుంటే బాగుండేదని, పెందుర్తి వంటి ప్రాంతానికి వేయడం సరైన నిర్ణయం కాదని వాదన వినిపిస్తోంది. మూడో అధికారి ఎం.ఆనందరావు. ఈయన కలెక్టరేట్‌లో పరిపాలన అధికారిగా చేశారు. అక్కడి నుంచి పెందుర్తికి వేశారు. అక్కడ తీవ్రమైన ఆరోపణలు రావడంతో సీతమ్మధారకు తీసుకువచ్చారు. ఎన్నికల సమయంలో పక్క జిల్లాకు పంపించి ఇప్పుడు ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్న పద్మనాభం తహసీల్దార్‌గా నియమించారు.



ఓ రైతు పండిస్తున్న గోరుచిక్కుడు తోట



పచ్చిమిర్చి సాగు చేస్తున్న రైతు

కూరగాయల సాగుతో సిరులు

మండలంలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలపై దృష్టిసారించిన రైతులు

పెందుర్తి, జూలై 27: వ్యవసాయమే జీవనాధారంగా మారిన మండలంలో గల జెర్రిపోతులపాలెం, నందవరపువానిపాలెం, చింతగట్ల, ఇప్పిలివానిపాలెంలలో గల రైతులు తమ వ్యవసాయ భూముల్లో ప్రధాన పంటగా వరిని సాగు చేసేవారు. అయితే వ్యవసాయం వర్షాధారం కావడంతో వాన చినుకు పడితేనే రైతుకు బతుకు నావ సాగేది. ఒకవేళ ప్రకృతి భారీ తుఫాన్లు వస్తే నష్టాలను చవిచూసేవారు. దీంతో ఇక్కడి రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలపై దృష్టిసారించారు.

ఇప్పటివరకు అంతర్గత పంటలుగా ప్రాధాన్యాన్ని సంతరించుకున్న కూరగాయల పెంపకాన్నే ఇప్పుడు తమ ప్రధాన వ్యాపకంగా మార్చుకున్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని రైతులు సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల సాగు చేపట్టారు. వంగ,బెండ, గోరుచిక్కుడు (బరబాటి), చిక్కుడు, టమాటా, బీర, కాకరకాయలతో పాటు పలు రకాల ఆకుకూరల పంటలను పండిస్తున్నారు. పంట పొలలాను చిన్న చిన్న కమతాలుగా ఏర్పాటు చేసుకుని కూరగాయల సాగు చేస్తున్నారు. నీటి సౌకర్యం సజావుగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. నీటితో పాటు ఇక్కడి కొండ ప్రాంత వాతావరణం చక్కగా కుదరడంతో కూరగాయల సాగు సిరులు కురిపిస్తుంది. ఇక్కడ పండించిన కూరగాయలను నగరంలోని పూర్ణామార్కెట్, రైతు బజార్లకు తరలించి విక్రయాలు జరుపుతున్నారు. వేకువజామునే రైతులు పండించిన కూరగాయల బస్తాలను ఆటోల్లో వేసుకుని నగరంలో హోల్‌సేల్‌గా విక్రయాలు జరుపుతున్నారు. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. కూరగాయల సాగు ఆరంభం నుంచి మూడు నెలల్లోనే పంట చేతికి వస్తుందని, పెట్టుబడి, ఇతర ఖర్చులు పోగా ఆదాయం బాగానే ఉంటుందని పేర్కొంటున్నారు. మండు వేసవిలో కూడా ప్రత్యేక శ్రద్ధతో కూరగాయలను పండించామని పలువు రైతులు తెలిపారు. అయితే రవాణా సదుపాయం లేదని, దీనికితోడు దళారులు బెడద అధికంగా ఉండడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు చెబుతున్నారు. ఉద్యానవనశాఖ అధికారులు ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే రైతులకు మరింత ఆర్థిక ప్రయోజనం కలిగే అవకాశం ఉందని చెప్పవచ్చు.

రవాణా సదుపాయం కల్పించాలి



తాము పండించే కూరగాయలు, ఆకు కూరలను నగరంలోని మార్కెట్‌కు రవాణా చేసేందుకు తగిన సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కార్గో బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలకు రవాణా ఖర్చులు అధికమవుతున్నాయి. కూరగాయలు సాగు బాగా సాగేలా వ్యవసాయాధికారులు స్పందించాలి. కూరగాయల పెంపకంపై మెరుగైన సౌకర్యాలు, రాయితీలు కల్పించాల్సిన అవసరం ఉంది.

-నందవరపు సన్యాసిరావు (నందవరపువానిపాలెం)

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు నివాళి

పెదగంట్యాడ, జూలై 27: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతిని శనివారం పలుచోట్ల నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఇందులో భాగంగా పెదగంట్యాడలోని టీడీపీ కార్యాలయంలో కలామ్ చిత్రపటానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకట రమణారెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలామ్ జీవితం భావితరాలకు ఆదర్శనీయమన్నారు. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన కలామ్ సంకల్ప బలం వల్లే అత్యున్నతమైన స్థాయికి చేరుకున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నమ్మి అప్పారావు, ఎం.పెంటయ్య, శ్రీముసిరి శ్రీనివాసరావు, సోమరెడ్డి, శ్రీరామమూర్తి,రమణ, అక్తర్,తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్, జూలై 27: జీవీఎంసీ 70వ వార్డు శ్రీనివాసనగర్‌లోని ట్వింకిల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్ మాట్లాడుతూ కలామ్ ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తొలుత కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. 2010లో తమ పాఠశాలకు కలామ్ విచ్చేసి విద్యార్థులకు అమూల్యమైన సందేశాలను ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరుణకుమారి, ఉపాధ్యాయులు మేడపల్లి గీత, శిరీష, గౌరి, లలిత, సంధ్య, పుణ్యవతి, పద్మావతి, కల్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అగనంపూడి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని అబ్దుల్ కలామ్ విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశాభివృద్ధికి ఆయన చేసేన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పల్లా కార్తీక్, ఇల్లపు ప్రసాద్, బి.అప్పారావు, బి.సత్యనారాయణ, జగదీశ్, కసిపల్లి శ్రీను, అచ్యుత్, హెచ్‌ఎం కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

కరాసలోని పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించిన సీపీ



క్వార్టర్స్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 27: జీవీఎంసీ 52వ వార్డు పరిధి కరాసలోని పోలీస్ క్వార్టర్స్‌ను శనివారం ఉదయం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పరిశీలించారు. ఇక్కడి నివాసితులు తమ ఇబ్బందులను కమిషనర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో ఆయన క్వార్టర్స్‌లో ఉన్న పరిస్థితులను తిలించేందుకు ఈ నెల 15న ఇక్కడకు వచ్చారు. ఆ సమయంలో క్వార్టర్స్‌లో పాడైన తలుపులు, పిచ్చిమొక్కలు, తాగునీటి లభ్యత, తదితర సమస్యలను స్థానికులు వివరించారు. ఆయా సమస్యలపై వివిధ విభాగాల అధికారులతో సీపీ మాట్లాడడంతో మొక్కలు తొలగింపు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరించారు. తాగునీటి బోరును కూడా ఏర్పాటు చేశారు. అయితే ఈ సమస్యలను ఎంత మేరకు పరిష్కరించారో తెలుసుకునేందుకు శనివారం మళ్లీ ఇక్కడకు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. క్వార్టర్స్‌లో ఒక హోంగార్డ్‌ను నియమిస్తామని ఆయన చెప్పడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఎటువంటి ఇబ్బందులున్నా తనను 7995095799 సెల్ నంబర్ ద్వారా సంప్రతించవచ్చని శంఖబ్రత బాగ్చి సూచించారు.

రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలి

కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న

ఉక్కుటౌన్‌షిప్, జూలై 27: రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న కోరారు. స్టీల్ డివిజన్ కేవీపీఎస్ ఏడో మహాసభను శనివారం ఉక్కునగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రజలందరూ పాటించాలని, బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ ఆశాజ్యోతి అని అన్నారు. కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణారావు, నాయకులు టి.చిరంజీవి, వైటీ దాసు, త్రిమూర్తులు, సత్యనారాయణ, బాలశౌరి, తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామాయణ హవనాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటాద్రిపై శ్రీరామాయణ హవనం

పెందుర్తి, జూలై 27: స్థానిక వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన చాతుర్మాస దీక్షలో భాగంగా శనివారం శ్రీరామాయణ హవనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారిని సుందరంగా అలంకరించగా పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఆగస్టు 18 నుంచి 13 రోజులపాటు వెంకటేశ్వరస్వామి నిత్య కల్యాణం జరుపనున్నారు.

పాఠశాల, ఎంఈవో భవనానికి మరమ్మతులు చేపట్టేందుకు కృషి

కూర్మన్నపాలెం, జూలై 27: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని వడ్లపూడి పాఠశాలతో పాటు ఎంఈవో భవనానికి ఇటీవల కురిసిన వర్షాలకు శ్లాబ్ లీకవ్వడంతో నీరు లోపలకు వస్తుండడంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం టీడీపీ రాష్ట్ర కార్శి బొండా జగన్ వాటిని సందర్శించగా, పరిస్థితిని ఉపాధ్యాయులు వివరించారు. సమస్యలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

86వ వార్డులో కుక్కలు పట్టివేత

కూర్మన్నపాలెం, జూలై 27: జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెం, శాతవాహన నగర్, తదితర ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తుండడంతో వీధి కుక్కల పట్టివేతకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రాత్రి వేళల్లో రోడ్డుకు అడ్డంగా కుక్కలు నిద్రిస్తూ వాహనదారులను వెంబడించి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అలాగే స్థానికంగా ఉంటున్న పలువురిని కరవడంతో కుక్కల నియంత్రణకు జీవీఎంసీ సిబ్బంది శనివారం శ్రీకారం చుట్టారు. వుడానగర్ ఫేజ్-1లో పలు కుక్కలను పట్టుకుని వ్యానులో తరలించారు.

సినిమా గైడ్

- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 36, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 42, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 38, క్యాబేజ్ 30, క్యారట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 37, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 72, బరబాటి 34, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 46, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 78, పొటల్స్ 38, కీరదోస 28, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 82, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	85
ఫారం ధర	--	105
విత్ స్కిన్	--	180
స్కిన్‌లెస్	--	190

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

విద్యార్థులు అంతర్జాతీయంగా రాణించాలి

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జూలై 27: విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకొనేలా చదువులో రాణించాలని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) సూచించారు. 61వ వార్డు ప్రకాశనగర్‌లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు విద్యా కిట్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాపురం ఉన్నత పాఠశాలకు మంచిపేరు ఉందన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు రాష్ట్రంలోనే పలు అంశాల్లో ఘనత సాధిస్తుండడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. హెచ్‌ఎం అరుణకుమారి పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో టీడీపీ 61వ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్, నాయకులు కాకి పోలిరెడ్డి, జయశంకర్, మాజీ అధ్యక్షుడు కె.రాము, కె.శ్రీనివాస్, రామ్మోహన్‌నాయుడు, జనసేన నాయకుడు చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో గణబాబు మొక్కలు నాటారు.



విద్యార్థినికి విద్యా కిట్ అందజేస్తున్న గణబాబు

ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలి

పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్

కూర్మన్నపాలెం, జూలై 27: కొన ఊపిరితో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,262వ రోజుకు చేరాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేస్తేనే సమస్యకు శాశ్వత శాశ్వత లభిస్తుందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పూర్తి సామర్థ్యంతో కర్మాగారానిన నడిపిన ట్టయితే 2030 నాటికి 300 మిలియన్ల టన్నుల సామర్థ్యానికి చేరవచ్చన్నారు. ముడసిరకుకు పూర్తి స్థాయిలో అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలే దేశానికి వెన్నెముక అని, వాటిని కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎంతోమంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామన్న ప్రకటన వచ్చేంత వరకు తాము ఆందోళనలను విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో శిక్షా సప్తాహ కార్యక్రమాలు

పెదగంట్యాడ, జూలై 27: పర్యావరణం, ప్రజారోగ్యం పట్ల విద్యార్థులకు అవగాహన అవసరమని స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గొందేశి ప్రభాకరరెడ్డి అన్నారు. పెదకోరాడ ఎంపీపీ పాఠశాలలో శనివారం నిర్వహించిన శిక్షా సప్తాహ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణ సమతుల్యతకు అందరూ విరివిగా మొక్కలు పెంచాలని, చిన్నారుల ఆరోగ్యానికి మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులక పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయురాలు నీలిమ, గ్రామ పెద్దలు గేదెల మధుసూధన్‌రెడ్డి, బస పీర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు అరుణకుమారి, త్రినాథ్, లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని అక్కిరెడ్డిపాలెం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు మహ్మద్ ఇస్మాయిల్ , రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87 వార్డు కణితి హైస్కూల్లో శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే సాంకేతిక నైపుణ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సూర్యప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తికరమైన ఎలక్ట్రికల్ టూల్స్ స్టైయిర్ కేసు వైరింగ్,గోడౌన్ వైరింగ్, ఫ్లోరోసెంట్ ల్యాంప్, పైప్ ఎర్తింగ్, సీపీయూ పార్ట్స్, మల్టీ మీటర్, తదితర ప్రాజెక్టులు చేసి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు ఎం.మన్నాజీ, ఎం.శ్రీనివాసరావు, ప్రసాద్, నారాయణరావు, రామశేషు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఐలా పార్కు వద్ద లారీలను పార్కింగ్ చేయరాదని నిరసన

ఆటోనగర్, జూలై 27: ఐలా పార్కు వద్ద లారీల అనధికార పార్కింగ్‌ను నిషేధించాలని కోరుతూ పలువురు వాకర్స్ సభ్యులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో రహదారిపై భారీ వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల వాకర్స్ రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందని పేర్కొన్నారు. రాత్రిపూట వీధి లైట్లు వెలగకపోవడంతో ఇక్కడ పార్కింగ్ చేసిన వాహనాల వల్ల రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ యార్డు ఉన్నా పలువురు డ్రైవర్లు తమ లారీలను రోడ్లపైనే పార్కింగ్ చేయడం సమంజసం కాదన్నారు. నిరసన తెలిపిన వారిలో వాకర్లు ఎస్.సత్య, బ్రహ్మాజీ, సంజీవ్, రాము తదితరులు ఉన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విజ్ఞాన్ ఫార్మసీ విద్యార్థులు

ఘనంగా లావు రత్తయ్య జన్మదిన వేడుకలు

అగనంపూడి, జూలై 27: విజ్ఞాన్ విద్యా సంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలను శనివారం దువ్వాడలోని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు విద్యార్థుల సంక్షేమంలో కేక్ చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి సత్యలక్ష్మి, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం అవసరం

పెందుర్తి, జూలై 27: ప్లాస్టిక్ రహిత సమాజం సామాజిక బాధ్యత అని సీడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వెన్నా నాగరాజు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ నివారణపపై చైతన్య సదస్సును శనివారం పెందుర్తిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి హాని కలిగే దుష్ప్రభావాలను స్థానికులకు వివరించారు. ప్లాస్టిక్ నియంత్రణతో ఆరోగ్య సమాజం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సలీమా, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

'పరిశ్రమల కాలుష్యాన్ని నివారించాలి'

మల్కాపురం, జూలై 27: పారిశ్రామిక ప్రాంతంలో హెచ్‌పీసీఎల్,కోరమాండల్ ఎరువుల కర్మాగారాల్లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇంటక్ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణానికి ఇంటక్ జిల్లా కార్యదర్శి తెప్పల సాంబశివరావు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాముంటున్న మాజీ సైనికుల కాలనీ పరిసరాల్లో గత కొద్దిరోజులుగా విపరీతంగా వెలువడుతున్న కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతున్నామన్నారు. దీనివల్ల చిన్నారులు, వృద్ధులు నానాపాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల కాలుష్య నివారణ కోసం సంబంధిత అధికారులు, ఇంటక్ నాయకులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

అమ్మ పేరుతో మొక్కలు నాటిన విద్యార్థులు

పెదగంట్యాడ, జూలై 27: ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 160 మంది విద్యార్థులు,వారి తల్లులు శనివారం స్కూల్ ఆవరణలో పలు రకాల మొక్కలు నాటారు. అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా వాటిని నాటారు. హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మ మీద ప్రేమతో నాటిన మొక్కలను సంరక్షిస్తామన్నారు. ఉపాధ్యాయులు షర్మిల, వాణి, శ్రీనివాసరావు, కిరణ్, శ్రీధర్, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం ఆవరణలో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రిన్సిపాల్ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారానికి చొరవపై అభినందన


ఎమ్మెల్యే వంశీకృష్ణను అభినందిస్తున్న గౌరీ సేవాసంఘం సభ్యులు

అల్లిపురం, జూలై 27: శాసనసభలో వెంకటేశ్వరమెట్ట భూ సమస్యను లేవనెత్తిన దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌కు అల్లిపురం వెంకటేశ్వరమెట్ట గౌరీ సేవా సంఘం కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న దేవదాయశాఖకు సంబంధించిన ఈ భూ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేసిన సందర్భంగా శనివారం ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభులు పొలమరశెట్టి శ్రీను, సూరిశెట్టి వేలు, బుద్ధా గోపి, సూరిశెట్టి శంకర్, బుద్ధ సన్యాసిరావు,దొడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఆ వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకోవద్దు'

కంచరపాలెం, జూలై 27: గత వైసీపీ ప్రభుత్వ రాక్షసపాలనలో భాగస్వాములైన ఎవరినీ టీడీపీలో చేర్చుకోవద్దని టీడీపీ జీవీఎంసీ 54వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్ కోరారు. ఈ మేరకు జిల్లా పార్లమెంటరీ స్థాయి నేత గండిబాబ్జీకి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ స్థితిలో వైసీపీ నుంచి కొంతమందిని టీడీపీలోకి చేర్చకోవడం వల్ల ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. తమ వార్డు నుంచి ప్రస్తుత కార్పొరేటర్ టీడీపీలోకి చేరడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

మొక్కలే మానవాళి మనుగడకు ఆధారం


కేంద్రీయ విద్యాలయంలో మొక్కలునాటుతున్న ప్రిన్సిపాల్

కంచరపాలెం, జూలై 27: మొక్కలు పెంపకంతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉంటుందని 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం- 2 ప్రిన్సిపాల్ జి. కిశోర్ పేర్కొన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్కూల్ న్యూట్రిషియన్ డే ను కేవీలో ఘనంగా నిర్వహించారు. అలాగే, వివిధ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మదీనా మాలిక్, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 42వ వార్డు జగన్నాథపురంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ఎం. ఆషాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలోఉపాధ్యాయులు ఎస్.వరలక్ష్మి, మాధురి, షేక్ గౌసియా బేగం, అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మి పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ యోజన కరపత్రాలు ఆవిష్కరణ



కరప త్రాలు ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, ఎమ్మెల్యేలు

డాబాగార్డెన్స్, జూలై 27: పీఎం సూర్యఘర్ యోజన పథకం కరపత్రాలను శనివారం జడ్పీ హాల్ విడుదల చేశారు. కలెక్టర్ ఎం.ఎం.హరేంధిరప్రసాద్, ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, జెడ్పీ చైర్‌పర్సన్ జి.సుభద్ర, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జెడ్పీ పోలినాయుడు, మునగపాక, అరకు, అనంతగిరి జెట్పీటీసీలతో ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్, జోన్ 3, అనకాపల్లి, నర్సీపట్నం, కశింకోట, పాడేరు అధికారులున్నారు. గృహ విద్యుత్ వినియోగదారులకు రాయితీపై ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

» సీపీ హెల్ప్‌లైన్ నంబర్‌కు

» కానిస్టేబుల్ అవినీతికి సంబంధించిన వీడియో?

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న మరో కానిస్టేబుల్‌పై నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి సస్పెన్షన్ వేటు వేశారు. ఫోర్త్‌టౌన్ లా అండ్ ఆర్డర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పి.హరీష్‌కుమార్ అవినీతిపై గుర్తుతెలియని వ్యక్తులు వీడియో తీసి సీపీ హెల్ప్‌లైన్ నంబర్ 7995095799కు వాట్సాప్ చేశారు. సీపీ దీనిని పరిశీలించిన మీదట కానిస్టేబుల్ అవినీతికి పాల్పడినట్టు స్పష్టమైన ఆధారాలు లభ్యం కావడంతో సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఫిర్యాదు చేసినవారి వివరాలు గోప్యంగా ఉంచాల్సి ఉన్నందున కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేయడానికి గల కారణాలను ఇప్పుడే వెల్లడించలేమని సీపీ వివరించారు. కాగా కానిస్టేబుల్ హరీష్‌కుమార్‌పై తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఉన్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్మాణంలో ఇనార్బిట్‌మాల్‌పై నుంచి పడి కొద్దిరోజులు కిందట ఝార్ఖండ్‌కు చెందిన వ్యక్తి మృతిచెందాడు. ఈ వ్యవహారంలో కానిస్టేబుల్ హరీష్‌కుమార్ భారీగా డబ్బులు గుంజినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో స్టేషన్‌లోని ఒక అధికారితోపాటు మరో కానిస్టేబుల్ ప్రోద్బలంతోనే హరీష్‌కుమార్ అలా వ్యవహరించినా, వారు నేరుగా అందులో పాల్గొనకపోవడంతో శిక్ష నుంచి తప్పించుకున్నారని అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు గంజాయి కేసులో వేరే రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ కేసులో నిందితుడు బెయిల్ కోసం ఒక లాయర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని, బెయిల్ పిటిషన్‌తోపాటు ష్యూరిటీ దారులను లాయర్ సిద్ధం చేసిన తర్వాత కానిస్టేబుల్ హరీష్‌కుమార్ జోక్యం చేసుకుని, బెయిల్ పిటిషన్‌ను ఆ లాయర్‌తో కాకుండా తమ స్టేషన్‌లోని కేసులకు సంబంధించిన వ్యవహారాలను చూసే లాయర్‌కు అప్పగించినట్టు మరికొందరు చెబుతున్నారు. ఈ క్రమంలో నిందితుడి వద్ద నుంచి హరీష్‌కుమార్ భారీగా గుంజినట్టు సమాచారం. వీటిల్లోనే ఏదో ఒక వ్యవహారం వీడియో రికార్డింగ్ చేసి సీపీకి పంపి ఉంటారని భావిస్తున్నారు. ఏదిఏమైనా సీపీగా శంఖబ్రతబాగ్చి బాధ్యతలు చేపట్టి నెల రోజులు కాకుండానే ఇద్దరిపై సస్పెన్షన్ వేటు వేయడంతోపాటు మరొకరిని వీఆర్‌కు సరండర్ చేయడంతో పోలీస్ శాఖలోని అవినీతిపరుల్లో గుబులు రేపుతోంది.

జడ్పీలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

పాలకుల నుంచి తమ పార్టీ కార్యకర్తలు ప్రాణాలకు తెగించి పోరాడి కాపాడుకున్నారని, కబ్జాలు ఎవరి హయాంలో ఎక్కువ జరిగాయో అందరికీ తెలుసునని వ్యాఖ్యానించారు. దోసూరు ఒక్కటే కాకుండా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు కాపాడాలని పేర్కొనడంతో బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు స్పందిస్తూ అంశాల వారీగా చర్చించుకోవాలే తప్ప రాజకీయాల ప్రస్తావన వద్దని పేర్కొనడంతో ఆయనకు పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు సుంకరి గిరిబాబు మద్దతు పలుకుతూ అప్రస్తుత విషయాలు ఇక్కడ వద్దన్నారు. దీనికి సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ చర్చ పక్కదారిపడుతున్నా సభకు ఎందుకు నియంత్రించడం లేదంటూ చైర్‌పర్సన్‌ను నిలదీశారు. ఆ తరువాత తిరిగి వ్యవసాయ శాఖపై చర్చ ప్రారంభం కావడంతో పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంతవరకూ రైతులకు రైతుభరోసా సొమ్ము జమ చేయలేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుకు ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భయపడుతున్నారని వ్యాఖ్యానించడంతో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని 9.7 లక్షల కోట్ల అప్పుల్లోకి గత పాలకులు తీసుకువెళ్లారని ఆరోపించారు. ఆర్థికంగా దివాలా తీయించారన్నారు. అందుకు ప్రతిగా గిరిబాబు మరోసారి మాట్లాడేందుకు యత్నించడంతో విజయకుమార్ జోక్యం చేసుకుని సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని..'పద్మనాభంలో మీ భూఆక్రమణలపై పత్రికల్లో వచ్చిన కథనాలపై మాట్లాడదామా?' అని ప్రశ్నించారు. దీంతో వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఒక్కసారిగా లేచి విజయకుమార్‌తో వాగ్వాదానికి దిగడంతో సభలో దుమారం రేగి స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ సభ్యులు మూకుమ్మడిగా సుందరపు విజయకుమార్ వైపు రావడంతో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మిగిలిన సభ్యులు ఇరువర్గాలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. గొడవకు దిగిన సభ్యులు బయటకు వెళ్లాలని సుభద్ర హెచ్చరించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు లేచి సభ్యులంతా సంయమనం పాటించాలని కోరడంతో సభలో వివాదం ముగిసింది. తరువాత బండారు మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన సమస్యలపై చర్చించేటప్పుడు ఇతర అంశాల ప్రస్తావన వద్దని సూచించగా, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ సభ్యులంతా సమన్వయంతో మెలిగి సమస్యలపై చర్చించాలని కోరారు.

స్థాయీ సంఘాల సభ్యులుగా ఎంపీలు, ఎమ్మెల్యేలు

శనివారం ఉదయం సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన రావికమతం జడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జడ్పీ స్థాయీ సంఘాల్లో కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలకు స్థానం కల్పించినట్టు జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు ప్రకటించారు. ప్రణాళిక, ఆర్థిక స్థాయీ సంఘం సభ్యులుగా అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం, పాయకరావుపేట, నర్సీపట్నం ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, వంగలపూడి అనిత, చింతకాయల అయ్యన్నపాత్రుడు, గ్రామీణాభివృద్ధి స్థాయీ సంఘ సభ్యుడిగా పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు నియమితులయ్యారు. వ్యవసాయ స్థాయీ సంఘ సభ్యునిగా విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, విద్య వైద్య స్థాయీ కమిటీ సభ్యుడిగా అరకులోయ ఎంపీ తనూజరాణి, స్త్రీ సంక్షేమ, రక్షణ స్థాయీ సంఘ సభ్యుడిగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, వర్క్స్ స్థాయీ సంఘ సభ్యులుగా భీమిలి, పెందుర్తి, అరకులోయ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, రేగం మత్స్యలింగం నియమితులయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు, మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, వరుదు కల్యాణి, జడ్పీటీసీ సభ్యులు, విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయసునీతా కృష్ణన్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

... 5వ పేజీ తరువాయి

అడబాల శ్రీనివాసరావును విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా, వి.సుజాతను కలెక్టరేట్‌లో ల్యాండ్స్ సూపరింటెండెంట్‌గా, ఎం.ఆనంద్‌కుమార్‌ను పద్మనాభం, కె.జయను మహారాణిపేటకు బదిలీ చేశారు. విజయనగరంలోని సీహెచ్‌వీ రమేశ్‌కు గోపాలపట్నం, పి.శ్యామ్‌ప్రసాద్‌ను ఆనందపురం తహసీల్దార్‌గా, కె.రమాదేవిని విశాఖ ఆర్‌డీఓ కార్యాలయంలో డివిజనల్ పరిపాలనా అధికారిగా వేశారు. శ్రీకాకుళం జిల్లాలోని ఎంఎ మనోరంజనిని భీమిలి ఆర్‌డీఓ కార్యాలయం ఏఓగా నియమించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి జె.తారకేశ్వరిని ములగాడకు వేశారు. శ్రీకాకుళం జిల్లాలోని బీటీవీ రామారావును విశాఖ రెవెన్యూ డివిజన్‌లో భూసేకరణ విభాగం స్పెషల్ తహసీల్దార్‌గా, ఎంవీకేఎస్ రవిని జీవీఎంసీ ఎస్టేట్ అధికారిగా, వి.శ్యామ్‌కుమార్‌ను కలెక్టరేట్‌లో కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్‌గా వేశారు. గాజువాకలో పనిచేస్తున్న టి.శ్రీవల్లిని అదే స్థానంలో కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. విశాఖలోని భూ సంస్కరణల విభాగంలో పనిచేస్తున్న కె.గణపతిరావును అదే స్థానంలో ఉంచారు.

ఆ ముగ్గురూ....

ఇప్పుడు జరిగిన బదిలీల్లో పి.శ్యామ్‌ప్రసాద్, కె.వేణుగోపాలరావు, ఎం.ఆనంద్‌కుమార్‌లకు కీలక మండలాలు కేటాయించడంపై విమర్శలు వస్తున్నాయి. శ్యామ్‌ప్రసాద్ గతంలో ఆనందపురంలో తహసీల్దార్‌గా పనిచేశారు. అక్కడి నుంచి పెందుర్తి వెళ్లారు. ఎన్నికల ముందు భోగాపురం పంపించారు. ఈయన ఎక్కడ పనిచేసినా వివాదాలు, ఆరోపణలే అధికం. భోగాపురం విమానాశ్రయం సమీపాన ఏపీఐఐసీకి చెందిన 70 ఎకరాల భూమిని వైసీపీ నేతలకు కట్టబెట్టడంలో కీలకపాత్ర పోషించారని ఆరోపణలు వచ్చాయి. పెందుర్తిలో పనిచేసినప్పుడు ప్రభుత్వ భూమిని జిరాయితీగా మార్చి, అందులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ వేసుకోవడానికి సహకరించారనే విమర్శలు ఉన్నాయి. పెందుర్తిలో వైసీపీ ఎమ్మెల్యేకి సహకరించారనే ఆరోపణలు వచ్చాయి. అటువంటి అధికారిని తీసుకువచ్చి ప్రభుత్వ భూములు అధికంగా ఉన్న ఆనందపురం తహసీల్దార్‌గా వేయడం ఆశ్చర్యపరిచింది. ఇక కె.వేణుగోపాలరావు...ఆయన భీమిలి నియోజకవర్గంలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో తహసీల్దారుగా పనిచేశారు. ఇప్పుడు ఆయన్ను పెందుర్తిలో వేశారు. ఎప్పుడూ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనువుగా ఉన్న మండలాల్లోనే ఆయన పోస్టింగ్‌లు వేయించుకోవడం వెనుక ప్రజా ప్రతినిధుల సహకారం ఉందనేది బహిరంగ రహస్యం. ఈయనపైనా అనేక ఆరోపణలు, విమర్శలు ఉన్నాయి. కీలక మండలాల్లో పనిచేసిన అధికారికి నాన్ ఫోకల్‌గా ఏ కలెక్టరేట్‌లోనే వేసుంటే బాగుండేదని, పెందుర్తి వంటి ప్రాంతానికి వేయడం సరైన నిర్ణయం కాదని వాదన వినిపిస్తోంది. మూడో అధికారి ఎం.ఆనందరావు. ఈయన కలెక్టరేట్‌లో పరిపాలన అధికారిగా చేశారు. అక్కడి నుంచి పెందుర్తికి వేశారు. అక్కడ తీవ్రమైన ఆరోపణలు రావడంతో సీతమ్మధారకు తీసుకువచ్చారు. ఎన్నికల సమయంలో పక్క జిల్లాకు పంపించి ఇప్పుడు ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్న పద్మనాభం తహసీల్దార్‌గా నియమించారు.

బీఎస్ఎన్ఎల్‌తో బీవీసీ గ్రూపు ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జూలై 27: టెలికాం, ఎడ్యుకేషనల్ రంగాల్లోని మారుతున్న స్థితిగతులను అవగాహన చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ పీజీఎంటీడీ పాల్ విలియమ్స్ విద్యార్థులకు సూచించారు. డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం బీఎస్ఎన్ఎల్, బీవీసీ గ్రూప్ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఎంఓయూతో మారుతున్న టెక్నాలజీని టెలికాం సెక్టార్‌ను విద్యార్థులు అందిపుచ్చుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. బీఎస్ఎన్ఎల్ పీజీఎం జి.ఆడమ్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పనలో ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏ విధంగా ఉన్నాయో వివరించారు. మరో సెక్షన్ పీజీఎం ఎం. సత్యప్రసాద్ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ నిర్వహిస్తున్నట్లు ట్రైనింగ్, రీసెర్చ్, ఎమర్జింగ్ 4జీ, 5జీ, 6జీ ఐఓటీ, ఎం.ఎల్ అండ్ ఏఆర్అండ్‌వీఆర్ ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీవీసీ గ్రూప్ ప్రిన్సిపాల్ టి.వి. జనార్దన్‌రావు, బీఎస్ఎన్ఎల్ అధికారులు కె. జగదీశ్వరరావు, బి. శ్రీనివాసరావు, ఆర్. శ్రీకాంత్, ఎన్‌వీబీ శ్రీదేవి పాల్గొన్నారు.

ఐటీఐ కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపు

కంచరపాలెం, జూలై 27 : కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో శనివారం నిర్వహించిన ఐటీఐ కౌన్సెలింగ్‌లో ఎలక్ట్రికల్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, వెల్డర్ తదితర ట్రేడుల్లో ఉన్న 132 సీట్లను అభ్యర్థులకు మెరిట్ ప్రకారం కేటాయించినట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. తొలిరోజే అధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరుకావడంతో మొదటి విడతలో మిగిలిన సీట్లు అన్నీ భర్తీ చేసినట్టు తెలిపారు. ఆదివారం కౌన్సెలింగ్ లేదని, అభ్యర్థులు గమనించి హాజరు కావద్దని కోరారు.

హౌరా-యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైల్లు కొనసాగింపు

విశాఖపట్నం, జూలై 27: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హౌరా, యశ్వంత్‌పూర్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల సర్వీసులను కొనసాగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఆగస్టు 15వ తేదీ వరకు హౌరా-యశ్వంత్ పూర్ ఎక్స్‌ప్రెస్ (02863), ఆగస్టు 17వ తేదీ వరకు యశ్వంత్‌పూర్ - హౌరా (02864) ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కాగా, గుంటూరు డివిజన్‌లో ట్రాఫిక్ బ్లాక్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సంత్రాగచ్చి-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(07222)ఆగస్టు 11నవయా విజయవాడ, వరంగల్, కాజీపేట మీదుగా, తిరిగి సికింద్రాబాద్-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (07221) ఆగస్టు 13న వయా కాజీపేట, వరంగల్, విజయవాడ మీదుగా నడుస్తాయని తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

మహారాణిపేట, జూలై 27: బంగారం, వెండి వస్తువులు దొంగలించిన నిందితుడిని అరెస్టు చేసినట్టు డీసీపీ (క్రైమ్) వెంకట రత్నం తెలిపారు. శనివారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. ఈనెల 22 వ తేదీన విశాఖ లోని పెదజాలారిపేట గాంధీ సెంటర్‌లో ఓ ఇంట్లో అర్ధరాత్రి దొంగతనం జరిగింది. దాదాపు 2.71 లక్షల రూ పాయలు 6 తులాల బంగారు వస్తువులు 3 కేజీ ల వెండి వస్తువులు అపహరించారు. దీనితో బాధి తులు ఎంవీపీ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు న మోదు చేసిన పోలీసులు అనుమా ని తునిగా పెద జాలారిపేటకే చెందిన గుర్రపు శివ (24) అనే పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకుని విచా రించారు. నేరం అంగీకరించటంతో అతని వద్ద నుంచి 36.76 గ్రా ముల బంగారం, 2604.87 గ్రాముల వెండి వస్తు వు లను రికవరీ చేశారు. అరెస్టు చేసి రి మాండ్‌కు తరలించినట్టు ఏసీపీ తెలిపారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

కంచరపాలెం, జూలై 27 : స్థానిక కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు బ్రాంచీల్లో చదువుతున్న టాపర్స్‌కు పూర్వవిద్యార్థులు (1971-1975) బ్యాచ్ ప్రామాణిక పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ మేరకు శనివారం వీటిని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి. రమణ చేతుల మీదుగా అందజజేశారు.పూర్వవిద్యార్థులు వి.రామచంద్రరావు, వి. నాగభూషణం, కనకసాయి, జె. శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మురళీనగర్ ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పల్లా. చంద్రమౌళి తెలిపారు.ఉదయం 6నుంచి మధ్యాహ్నం వరకు సేవలందిస్తారు.

బదిలీ రద్దాయె, సొమ్ములు పోయె!

... 5వ పేజీ తరువాయి

అనుమతి మేరకు జరిగిన బదిలీలకు ఆర్థిక శాఖ అనుమతి లేకపోవడం. మూడోది..సీఎం కార్యాలయం, ఆర్థిక శాఖ నుంచి అనుమతి లేకుండా చేసిన బదిలీలు. ఈ మూడింటిలో తొలి రెండు రకాల బదిలీల జోలికి ప్రస్తుత ప్రభుత్వం వెళ్లకుండా సీఎం పేషీ, ఆర్థిక శాఖ అనుమతి లేకుండా జరిగిన బదిలీలను మాత్రం రద్దు చేసింది. ఈ బదిలీల్లో విజయనగరానికి చెందిన వ్యక్తే కీలక పాత్ర పోషించారు. మంత్రి వద్దకు వెళ్లిన టీచర్లతో సదరు పీఏ మాట్లాడి డబ్బులు వసూలు చేసేవారు. నెల్లిమర్ల మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల టీచరు ఒకరు బ్రోకరుగా ఉన్నారు. కొందరు మంత్రి పీఏకు, మరికొందరు టీచరుకు సొమ్ములు ఇచినట్టు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. విశాఖ జిల్లా నుంచి సుమారు రెండు కోట్ల రూపాయల వరకు వసూలు చేశారని అంటున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి తరువాత చేసిన బదిలీలను ప్రభుత్వం రద్దు చేయడంలో సొమ్ములు ఇచ్చిన టీచర్లంతా సదరు పీఏను కలిసేందుకు విజయనగరం వెళ్లగా...అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లి వాకబు చేస్తే క్యాంపు వెళ్లారని చెబుతున్నారు. ఎప్పుడు వస్తారని అడిగితే సమయం పడుతుందని తప్పించుకుంటున్నారని పలువురు వాపోయారు. చివరకు ఫోన్ కట్టేయడంతో లబోదిబోమంటున్నారు. మరికొందరు నెల్లిమర్ల మండలంలో ప్రభుత్వ టీచరును కలిసి తాము ఇచ్చిన సొమ్ములు సంగతి ఏమిటని ప్రశ్నిస్తే తనకు సంబంధం లేదని చెబుతున్నారు. వారం నుంచి ఆయన కూడా సెల్‌ఫోన్ ఆపేసి స్కూలుకు రాకుండా తప్పించుకుంటున్నారని సొమ్ములు ఇచ్చిన టీచర్లు వాపోతున్నారు. ఇటువంటి వ్యవహారాల్లో పని జరిగితే అదృష్టమే తప్ప ఇచ్చిన సొమ్ములకు గ్యారంటీ ఉండదని ఉపాధ్యాయ సంఘాల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

పొదుపు సంఘాల మహిళలకు చేయూత


సమావేశంలో డ్వాక్రా మహిళలతో బీజేపీ నేత శ్యామల దీపిక, ఏపీడీ పద్మావతి

మురళీనగర్, జూలై 27 ; పొదుపు సంఘాల ద్వారా మహిళల స్వయం స్వావలంబనకు మరింతగా ప్రభుత్వం చేయూత నిస్తుందని జోన్-5 యూసీడీ విభాగం ఏపీడీ పద్మావతి అన్నారు. శనివారం మాధవధార గాంధీనగర్‌లో జరిగిన టౌన్ లెవెల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్) సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రుణ మంజూరు, తిరిగి చెల్లింపుల ద్వారా సక్రమంగా చేపట్టాలని సూచించారు. గతంలో డ్వాక్రా సంఘాలకు రూ.7 లక్షల వరకే రుణ పరిమితి ఉంటే, ప్రస్తుతం దానిని గరిష్టంగా రూ. 20 లక్షల వరకు మంజూరు చేస్తున్నామని ఏపీడీ పేర్కొన్నారు. ఎస్ఎల్ఎఫ్ గ్రూప్ మహిళా సభ్యులు, ఆర్పీలు పాల్గొన్న ఈ మీటింగ్‌లో నార్త్ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామల దీపిక హాజరయ్యారు. జోన్-5 పరిధిలోని 47 నుంచి 54 వరకు ఉన్న ఎనిమిది వార్డుల డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

1 నుంచి దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్ జాన్ ప్రకాష్, తదితరులు

జ్ఞానాపురం, జూలై 27: స్థానిక పునీతుపేతు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో దేవమాత మోక్షరోపణ మహోత్సవాలు ఆగస్టు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు దేవాలయం విచారణ కర్తలు ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. జ్ఞానాపురం చర్చి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టరు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆగస్టు 1వ తేదీ గురువారంపూజ అనంతరం సిలువగుర్తు మండపంలో పీపీసీ అధ్యక్షులు రాజేష్‌తో మహోత్సవ పతాక ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం 14 వరకు ప్రతిరోజూ జపమాల, దివ్యపూజ, పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నట్టు వివరించారు. 15 వతేదీన ప్రధాన ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఫాదర్లు పి.వినయ్ కుమార్, పి. అంథోని, పీపీసీ అధ్యక్షుడు మునురు రాజేష్,కార్యదర్శి ఫ్రాన్సిస్, జాయింట్ సెక్రటరీ గేదల ఆనంద్, కుమెలి నిర్మల రాజు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపితే రివార్డు... తప్పుచేస్తే శిక్ష: సీపీ


ప్రశంసా ప్రతం అందిస్తున్న సీపీ శంఖ బ్రతబాగ్చీ

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో పనిచేసే పోలీసు సిబ్బందికి రివార్డులు ఇస్తామని, తప్పుచేసిన వారికి మాత్రం శిక్ష తప్పదని సీపీ శంఖబ్రతబాగ్చి అన్నారు. కమిషనరేట్‌లో శనివారం రివార్డు మేళా ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వివిధ కేసుల్లో ప్రతిభ చూసిన కానిస్టేబుల్ నుంచి సీఐ స్థాయి వరకూ 81 మందికి ఆయన రివార్డులు అందజేశారు.ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీలు అజితావేజెండ్ల, తుహీన్‌సిన్హా తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ప్రక్షాళనకు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్మాణాలకు ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. గాజువాక పరిధి తుంగ్లాం ప్రాథమిక పాఠశాల కబ్జాకు గురైందని, దీనిపై ఎందుకు ఫిర్యాదు చేయలేదని అధికారులను నిలదీశారు. దీనిపై చైర్‌పర్సన్ సుభద్ర బదులిస్తూ తక్షణమే తుంగ్లాంలో ఆక్రమణలు తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈలోగా జడ్పీ సీఈవో పోలినాయుడు మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపునకు న్యాయపరంగా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

వేర్వేరుగా సమావేశాలు నిర్వహించండి

జడ్పీ సమావేశంలో పూర్తిస్థాయిలో అజెండా చర్చకు రావడం లేదని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. కేవలం మూడు, నాలుగు అంశాలు మాత్రమే చర్చకు వస్తున్నాయని పేర్కొంటూ మొత్తం అంశాలపై చర్చించాలంటే అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఒక సమావేశం, అనకాపల్లి, విశాఖ జిల్లాల పరిధిలో సభ్యులకు ఒక సమావేశం ఏర్పాటుచేయాలని సూచించగా, సీఈవో పోలినాయుడు వివరణ ఇస్తూ సమావేశాలు వేర్వేరుగా నిర్వహణకు కోరం సమస్య తలెత్తుతుందని పేర్కొంటూ, దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశానికి తొలిసారిగా వచ్చిన ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు, విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, సుందరపు విజయకుమార్‌లను సత్కరించారు.

దసపల్లా భూములపై దృష్టి పెట్టేనా??

... 5వ పేజీ తరువాయి

గతంలో జీవీఎంసీ నిర్మించిన వాటర్ ట్యాంకులు ఉన్నాయి. సుమారుగా 2,200 చ.గ. విస్తీర్ణంలో అవి ఉండడంతో వాటిని అక్కడి నుంచి మార్చాలని ఎష్యూర్ ఎస్టేట్స్ నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికలకు నాలుగు నెలల ముందు జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ రాసింది. సర్వే నంబర్ 1197లో 2,200 గజాల్లో వాటర్ ట్యాంకులు ఉన్నాయని, వాటిని మరో ప్రాంతానికి మార్చాలని, వాటికి అయ్యే వ్యయం తామే భరిస్తామని కోరింది. దీనికి కూడా జీవీఎంసీ అధికారులు లోపాయికారీగా సహకరించారు. మరోవైపు సర్క్యూట్ హౌస్ నుంచి పందిమెట్ట వరకు 30 అడుగుల రహదారి ఉండగా దానిని 100 అడుగులకు విస్తరించడానికి వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేశారు. రహదారి నిర్మాణానికి గత డిసెంబరులో జీవీఎంసీ పత్రిక ప్రకటన కూడా జారీచేసింది. ఎష్యూర్‌కు దఖలు పడిన భూముల్లో కాకుండా ఆ ప్రాంతంలో ఇతరుల భవనాలు దెబ్బతినేలా 100 అడుగుల రహదారి విస్తరణకు నిర్ణయించారు. దీనిపై పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వైసీపీ హయాంలో ఉన్నప్పుడు ట్యాంకులు మార్చడానికి, రహదారి నిర్మాణానికి నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారినందున సమగ్రంగా విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

ఎవరికీ హక్కులు కల్పించడం తగదు

- పీతల మూర్తి యాదవ్, జనసేన కార్పొరేటర్

టౌన్ సర్వే రికార్డుల్లో దసపల్లా భూముల కొనుగోలుదారుల పేర్లు నమోదు చేయడానికి వారి దగ్గర ఎటువంటి పత్రాలు లేనందున అధికారులే తిరస్కరించారని మూర్తి యాదవ్ ఆరోపించారు. పైగా ఆ భూములు తమవని రాణీ సాహెబా వాద్వాన్ వారసులు న్యాయ పోరాటం చేస్తున్నందున వాటిపై ఎవరికీ హక్కులు కల్పించడం తగదని శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం దసపల్లా భూములను తప్పకుండా కాపాడుతుందన్నారు.

భీమిలి తహసీల్దార్‌గా రామారావు



భీమునిపట్నం, జూలై 27 : మండల నూతన తహసీల్దార్‌గా పైల రామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన తాడ్డి గోవింద్‌ను విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలానికి బదిలీ చేశారు. తహసీల్దార్ రామారావుకు కార్యాలయం హెచ్‌డీటీ సూరిశెట్టి శ్రీనుబాబు. సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, సత్కరించారు.

చినగదిలికి పాల్ కిరణ్

ఆరిలోవ : చినగదిలి తహసీల్దార్‌గా ఎం. పాల్ కిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయం సిబ్బంది, డీలర్లు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఆనందపురం : తహసీల్దార్‌గా పేర్ని శ్యామ్‌ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం జిల్లా భోగాపురం మండలం నుంచి బదిలీపై ఇక్కడి వచ్చారు.

తహసీల్దార్ వెంకట్రావుకు సన్మానం

పద్మనాభం (రూరల్), జూలై 27 : తహసీల్దార్ వెంకట్రావును రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది, డీలర్లు శనివారం ఘనంగా సన్మానించారు. ఆయనకు పద్మనాభం నుంచి వేరే మండలానికి బదిలీ కావడంతో ఈ సన్మానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ యోగి, ఎంఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్‌ఓలు, డీలర్లు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత

పద్మనాభం, జూలై 27 : పద్మనాభం పంచాయతీలో డ్రైనేజీల్లో పూడికపోయిన పూడికను పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు శనివారం తొలగించారు. 'పల్లెల్లో వ్యాధుల భయం' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన పాలకవర్గం, అధికారులు పారిశుధ్యాన్ని మెరుగుపరిచే పనులు చేపట్టారు. ఈమేరకు సర్పంచ్ టి. పాప భర్త పద్దు, పంచాయతీ కార్యదర్శి రఘు ఆధ్వర్యంలో అనంతుని గిరికి వెళ్లే మార్గంలో ఉన్న గెడ్డలో పూడికపోయిన చెత్తను తొలగించి, మురుగునీటి పారుదలకు మార్గం సుగమం చేశారు. అలాగే మురుగునీరు రోడ్డు మీదకు రాకుండా చర్యలు చేపట్టి, బ్లీచింగ్ చల్లించారు.

130 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ఆనందపురం, జూలై 27 : వెల్లంకి గ్రామంలోని సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో వృక్ష ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు 130 మందికి పరీక్షలు చేసి, 25 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గీతాంజలి, గంగాధర్, గ్రామ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకర సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయం పునఃప్రారంభం వాయిదా

భీమునిపట్నం, జూలై 27 : పట్టణంలోని జోనల్ కార్యాలయం పునఃప్రారంభం వాయిదా పడినట్టు జడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు. ఈమేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన మేయర్ గొలగాని హరివెంకటకుమారి కార్యాలయాన్ని ప్రారంభించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని చెప్పారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

భీమునిపట్నం (రూరల్), జూలై 27 : మండలంలోని నర్సయ్యపేట, తాళ్లవలస, నగరపాలెం గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు వైద్య సిబ్బంది శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

మద్దిలపాలెం, జూలై 27 : మద్దిలపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద రాబిన్‌హుడ్ ఆర్మీ వాలంటీర్లు వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై శనివారం అవగాహన కల్పించారు. ప్రమాదాలకు దారి తీసే కారణాలపై ప్లకార్డులు ప్రదర్శించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, అతివేగంగా ప్రయాణించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో రాబిన్‌హుడ్ ఆర్మీ వాలంటీర్ల నిర్వాహకురాలు ఎం. రేణుక, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)

● **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)

● **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)

● **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 36, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 42, బీరకాయలు 40, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 30, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 72, అల్లం (పాతది) 150, బరబటి 34, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 46, దోసకాయ 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 78, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 82, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	85
ఫారం ధర	--	105
విత్ స్కిన్	--	180
స్కిన్‌లెస్	--	190

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, జూలై 27 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజామునే సింహాచలం కొండదిగువకు చేరుకుని పుష్కరిణిలో స్నానాలు చేసి అడవివరం అటవీ ప్రాంతంలో ఉన్న భైరవస్వామిని దర్శంచుకున్నారు. అక్కడ అమృత కలశాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మెట్ల మార్గంలో కాలినడకన కొందరు, బస్సుల్లో మరికొందరు సింహగిరికి చేరుకుని అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. భక్తులు అధికంగా రావడంతో ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద, అన్నప్రసాద భవనం వద్ద, దర్శనాలకు ధ్వజ స్తంభం వద్ద రద్దీ కనిపించింది. కాగా విజయనగరం ప్రాంతానికి చెందిన జి. మధు స్వామి దర్శనానికి మెట్ల మార్గంలో మోకాళ్లపై చేరుకోవడం పలువుర్ని అబ్బురపరచింది. ఏడాదికి ఒకసారి తాను మెట్ల మార్గంలో మోకాళ్లపై నడిచి స్వామివారిని దర్శించుకుంటానని చెప్పారు.



స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

వైభవంగా ఆర్జిత సేవలు

వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా తీర్చిదిద్ది ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యావచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు జరిపారు. తొలుత ప్రభాతారాధనల అనంతరం పవిత్ర తులసీ దళాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్న ప్రసాదపథకానికి రూ.లక్ష విరాళం

వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి గాజువాక ప్రాంతానికి చెందిన ఆకుల అప్పలసూరి రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో శనివారం ప్రొటోకాల్ పర్యవేక్షణాధికారి సిరిపురపు కనకరాజుకు అందజేశారు. ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు.

నారాయణరాజుపేటలో రైతుల ఆందోళన

భీమునిపట్నం (రూరల్), జూలై 27 : మండలంలోని నారాయణరాజుపేట గ్రామంలో తమకు చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన సూర్యనారాయణ రియల్ ఎస్టేట్ వ్యాపారికి విక్రయించాడని ఆరోపిస్తూ రైతులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామంలో గాడు రామసూరప్పడు, సన్యాసప్పడు, పైడిశెట్టి, బోని అప్పలనాయుడు, మొకర సూరప్పయ్యమ్మ తదితర 12 మంది రైతులకు సర్వే నంబరు 20లో 3 నుంచి 12 నంబర్ల వరకు 5.06 ఎకరాలు ఉంది. దీన్ని వారు తమ తాతతండ్రుల నుంచి సాగు చేస్తున్నారు. దీనికి పట్టాదారు పాసు పుస్తకాలు, డాక్యుమెంట్లు ఉన్నాయి. 2008లో వారు ఈ భూమిని ఎకరా రూ. 5 లక్షలు చొప్పున విక్రయించడానికి గ్రామ పెద్దగా ఉన్న సూర్యనారాయణ మధ్యవర్తిగా ఉంచి ఎకరాకి రూ. 15 వేలు చొప్పున అడ్వాన్సుగా తీసుకున్నారు. తర్వాత మిగిలిన సొమ్ములో రూ. 7 లక్షలు తీసుకుని పంచుకున్నారు. ఆ సమయంలో వారు తమ డాక్యుమెంట్లను సూర్యనారాయణకు అందజేశారు. ఆయన మిగిలిన డబ్బులు ఇదిగో ఇస్తాం.. అదిగో ఇస్తామని తిప్పించడంతో పాటు డాక్యుమెంట్లను రైతులకు తిరిగి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 20న న్యాయవాది నుంచి రైతులకు నోటీసు అందింది. అందులో రైతుల భూమిని సూర్యనారాయణకు విక్రయించినట్టు ఉంది. సూర్యనారాయణ 5.06 ఎకరాలతో పాటు తనకు చెందిన భూమిని కలిపి 22.84 ఎకరాలను విశాఖకు చెందిన శంకరరావుకు విక్రయించడానికి అగ్రి మెంటు చేసుకుని రూ1,92,82,000 తీసుకున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. భూమిపై తమకు ఎటువంటి హక్కు లేదని నోటీసులో ఉండడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.



భూముల పత్రాలు చూపిస్తున్న రైతులు

కలామ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

ఏయూ ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, జూలై 27 : మన జీవితం మన చేతుల్లోనే ఉంటుందని, దాన్ని ఉన్నతంగా మలచుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య శశిభూషణరావు అన్నారు. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ వర్ధంతి పురస్కరించుకుని శనివారం ఆయన కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశ రక్షణ రంగానికి, శాస్త్రీయ పరిశోధనలకు కలామ్ ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. కిషోర్‌బాబు, ,,తదితరులు పాల్గొన్నారు. అలాగే పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ జ్యోతి మాట్లాడుతూ యువత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. శనివారం ఆమె కలామ్ వర్ధంతి సందర్భంగా స్కూల్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటారు.

భీమునిపట్నం : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి పలువురు పూలమాలవేసి నివాళి అర్పించారు. స్టూడెంట్స్ యూనైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సూర్యప్రసాద్, టీడీపీ నాయకులు యార్లగడ్డ జీవన్‌కుమార్, సన్ కార్యవర్గ సభ్యులు కర్రి నరేష్, కాకర సురేష్, దలై శివ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సుమంత్‌నాయుడు, తమ్మిన సూరిబాబు, గేరే సదానంద పాల్గొన్నారు.



వీసీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సాంబశివరావు

వీసీని అభినందించిన మాజీ డీజీపీ

వెంకోజీపాలెం, జూలై 27 : ఏయూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య శశిభూషణరావును మాజీ డీజీపీ ఎన్. సాంబశివరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయం అభివృద్ధిపై చర్చించారు. ఏయూ అంటే తనకు ప్రత్యేకమైన అభిమానమని, ఏయూతో తనకున్న అనుభూతులను ఈ సందర్భంగా మాజీ డీజీపీ గుర్తు చేసుకున్నారు.

జల జీవన్ మిషన్ పనులు పరిశీలన

పద్మనాభం,జూలై 27 : మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటికీ కుళాయిల పనులను జల జీవన్ మిషన్ జాతీయ ప్రతినిధులు శనివారం పరిశీలించారు. కొవ్వాడ, పాండ్రంగి, మద్ది, కృష్ణాపురం గ్రామాల్లో చేపడుతున్న పనులతో పాటు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, మురుగుదొడ్ల వినియోగం తదితర వాటిపై ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులతో చర్చించారు. మద్దిలో సర్పంచ్ సన్యాసమ్మ బృంద సభ్యులను గ్రామ సభకు ఆహ్వానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ జల జీవన్ మిషన్ వాష్ నిపుణులు అహ్మద్, మాధ్యూ జార్జి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ దుర్గాంబ, ఏఈ చిరంజీవి, జేజేఎం డీపీఎంయూ జిల్లా కోఆర్డినేటరు పుల్లయ్య, కృష్ణాపురం సర్పంచ్ లక్ష్మీ భవానీ, స్థానిక నాయకులు ఎం. అప్పలనాయుడు, కేవీ సత్యనారాయణ, బి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆరిలోవ, జూలై 27 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంఈఓ అనురాధ అన్నారు. శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా శనివారం పైనాపిల్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయిపాలెంలో మొక్కలు నాటిన జడ్సీ

తగరపువలస, జూలై 27 : జీవీఎంసీ రెండో వార్డు రాయిపాలెం ఉన్నత పాఠశాలలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి అమ్మ పేరుతో శనివారం మొక్కలు నాటారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారితో వారి తల్లి పేరుతో మొక్కలు నాటించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం జె. రాధాకుమారి విద్యార్థులతో ఎకో క్లబ్‌ను ఏర్పాటు ఏర్పాటు చేశారు. బంగ్లామెట్ట పాఠశాలలోనూ ఎకో క్లబ్ ఏర్పాటు చేశారు.



డీఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వంశీకృష్ణ

డీఐజీని కలిసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

మద్దిలపాలెం, జూలై 27 : విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టిని ఆయన క్యాంపు కార్యాలయంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆక్రమణలు తొలగింపు



మధురవాడ, జూలై 27 : మిథిలాపురి వుడాకాలనీ సమీపంలో ఉన్న శ్రీకృష్ణానగర్ లేఅవుట్‌లో ఉన్న ఆక్రమణలను చినగదిలి మండల రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. మధురవాడ సర్వే నంబరు 277/1, 277/2లో కొంత భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం 22ఎలో ఉంది. ఈ విభాగంలో ఉన్న భూములను కొనడం, అమ్మడంపై నిషేధం ఉంది. కానీ కొందరు ఈ భూమిలో ఇటీవల ఎనిమిది రేకుల షెడ్లు నిర్మించారు. ఒక సొసైటీ పేరుతో అనధికారికంగా వీటిని విక్రయిస్తున్నట్టు అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. సుమారు రూ. 10 కోట్ల విలువైన భూములు చేతులు మారుతున్న క్రమంలో రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని ఆక్రమణలు తొలగించారు. ఇదే లేఅవుట్‌లో కొన్ని ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటిని కేవలం ప్రజావసరాలకు మాత్రమే వినియోగించాలి. కానీ కొందరు వాటిని అనధికారికంగా తమ ఆధీనంలో ఉంచుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణ

ఎంవీపీ కాలనీ, జూలై 27 : ఈస్ట్ పాయింట్ కాలనీలోని ఓషన్ విస్టా బే హోటల్‌లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎస్ఎంఈ, ఏపీ చాంబర్స్ ఉమెన్ వింగ్ సంయుక్తంగా మహిళా పారిశ్రామికవేత్తలకు శనివారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాయి. బిజినెస్ అమృధి పేరిట నిర్వహించిన ఈ శిక్షణకు ప్రముఖ పారిశ్రామికవేత్త, సాంకేతిక నిపుణుడు, యాక్షన్ కోచ్ రవికిషోర్ పాల్గొని, మాట్లాడారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

పద్మనాభం (రూరల్), జూలై 27 : మండలంలోని రేవిడి గ్రామానికి చెందిన రెల్లి సురేష్ నేపాల్‌లో జరిగే ఆసియా షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికకావడంతో స్థానిక శ్రీనివాసా యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో వీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాస్‌రెడ్డి రూ. 10 వేల ఆర్థిక సహాయం చేశారు. శనివారం ఆయన సభ్యులతో కలిసి సురేష్ ఇంటికి వెళ్లి నగదు ఇచ్చారు.

గాయత్రి కళాశాలలో కొత్త కోర్సులు

సాగర్‌నగర్, జూలై 27 : గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలో బీఏ సంస్కృతం, స్పెషల్ తెలుగు కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బోస్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కోర్సులు అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని, విద్యార్థులకు తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు కళాశాల కార్యాలయంలో సంప్రతించాలని ఆయన సూచించారు.

ముగ్గులు వేసి రైతుల వినూత్న నిరసన



దీక్షా శిబిరం వద్ద ముగ్గులు వేస్తున్న మహిళా రైతులు

కొమ్మాది, జూలై 27 : రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని ఎంఆర్‌పీఎస్ నాయకుడు మొర్ల రమణ అన్నారు. బక్కన్నపాలెంలో హుద్‌హుద్ తుఫాన్ బాధితుల ఇళ్ల వద్ద నిర్వాసిత రైతులు శనివారం ముగ్గులు వేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కొందరికి తప్పుడు దాడిలో ఇళ్ల కేటాయించారని ఆరోపించారు.ఇళ్ల కేటాయింపుపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు ఇళ్ల కేటాయింపు నిలుపుదల చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు పోతు రాజు, నాగరాజు, పైడితల్లి, స్వాతి, సోమమ్మ, కొండమ్మ, సీపీఎం నాయకుడు డి. అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలో శిశువు మృతదేహం

కొమ్మాది, జూలై 27 : మధురవాడ, మారికవలస డబుల్ రోడ్డులో శనివారం ఉదయం నవజాత శిశువు మృతదేహం లభించింది. అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన చెత్త కుప్పలో పడేయడంతో మృతి చెందింది. శిశువు మృతదేహాన్ని చూసిన స్థానికులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఈ విషయం పీఎంపాలెం పోలీసులకు తెలియడంతో వారు వైద్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

వెంకోజీపాలెం, జూలై 27 : ఏయూ జియోలజీ విభాగం, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మైనింగ్ ప్రాసెస్, బీచ్ ఇసుక పరిశ్రమలతో ఉపయోగాలు వంటి అంశాలపై సెప్టెంబరు 27, 28 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ శశిభూషణరావు శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

31న భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

భీమునిపట్నం, జూలై 27 : పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 31న పలు కోర్సుల్లో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీసీపీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాల్లో తక్షణ ప్రవేశాలు జరుగుతాయన్నారు. పాలిసెట్ రాయకపోయినా ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా సీటు పొందిన వారికి ఎటువంటి ఫీజు రాయితీ, స్కాలర్ షిప్ సౌకర్యం ఉండదన్నారు. ఆసక్తి గల వారు ఆ రోజు కళాశాలకు హాజరుకావాలని సూచించారు.

ఆదర్శనగర్‌లో బైక్ దగ్ధం



ఎంవీపీ కాలనీ, జూలై 27 : ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం కాలిబూడిదయ్యింది.ఎంవీపీపోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్ వద్ద శనివారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. వాహనంలోని వైర్లను ఎలుకలు కొరికేయడంతో షార్ట్ సర్క్యూట్ అయి నిప్పురేగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. పట్ట పగలు జరిగిన ఈ సంఘటనతో ప్రజలు కాసేపు భయాందోళనకు గురయ్యారు.